

# క్యాన్సర్‌ను జయిద్దాం

- గోదావరి జిల్లాల్లో బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ కేసులే ఎక్కువ
- నాలుగింట మూడొంతులు మహిళలే
- తొలిసారిగా ఇంటింటా స్క్రీనింగ్ టెస్టుల సర్వేకు శ్రీకారం
- ఆస్పత్రులకు భారీగా బాధితుల తాకిడి
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం

6

గోదావరి జిల్లాల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వయసుతో నిమిత్తం లేకుండా స్త్రీ పురుషులకు ఈ వ్యాధి సోకుతోంది. ప్రజలు సరైన అవగాహనతో జీవన విధానంలో తప్పని సరిగా మార్పులు చేసుకోవాలి. అలాగే రోగులకు భరోసాను, ధైర్యాన్ని కలిగిస్తూ వారికి అండగా ఉండాలి.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి.. టీచర్ల ఆందోళన

ఏడుకు చేరిన బాణసంచా పేలుడు మృతుల సంఖ్య

7

# డీజిల్ లేక ఆపేస్తున్నారు..!

**సేవలకు దూరంగా 108 అంబులెన్సులు.. రోగుల అవస్థలు**

ఏలూరు క్రైం/భీమవరం టౌన్/ముసునూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒకటి రెండు, రోజులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 108 అంబులెన్స్‌లు డీజిల్ లేని కారణంగా నిలిచిపోతున్నాయి. దీనితో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాల్లో ఉన్న వారిని ఆసుపత్రులకు తరలించడానికి 108 అంబులెన్సులను 2005 ఆగస్టు 15న ప్రారంభించారు. మండలానికి ఒక అంబులెన్సు చొప్పున ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 48 వాహనాలు తిరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో 108 అంబులెన్సుల నిర్వహణను అరబిందో కంపెనీ కాంట్రాక్టు పొందింది. చేసేది తక్కువ, బిల్లులు ఎక్కువ తీసుకుంటూ ప్రజలకు అంతంతమాత్రంగానే సేవలందించారు. కూటమి ప్రభుత్వం రావడంతో తమ ఆటలు సాగవని భావించారో ఏమో కాని ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకు రావడానికి తమ ధైన శైలిలో అంబులెన్సు సేవలను క్రమేపీ నిలుపుదల చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 29 అంబులెన్సులు ఉండగా తొమ్మిదింటిని నిలుపుదల చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయిగూడెం, కలిదిండి, మండవల్లి, చాట్రాయి, ఆగిరిపల్లి, భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లోని అంబులెన్సులు బుధవారం నాటికి పూర్తిగా నిలిచిపోయాయి. దీనిపై ఏలూరు జిల్లా 108 అంబులెన్సు మేనేజర్ దాసరి వెంకటేష్‌ను వివరణ కోరగా డీజిల్ లేక నిలిచిపోయాయని గురువారం నాటికి వాటి సేవలను కొనసాగించడానికి ప్రయత్నాలు చేస్తున్నామంటూ వెల్లడించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో నడపలేకపోతున్నట్లు ప్రజలకు చెబుతున్నారు.



డీజిల్ లేక ముసునూరు ప్రభుత్వాసుపత్రి వద్ద నిలిచిన 108 అంబులెన్స్ వాహనం

భీమవరం జిల్లాలో 108 అంబులెన్సులు 21 ఉండగా వాటిలో మంగళవారం నుంచి బుధవారం సాయంత్రం వరకూ 11 నిలిచిపోయాయి. కేవలం నాలుగు మాత్రమే నిలిచిపోయాయని ఆ జిల్లా 108 అంబులెన్సుల మేనేజర్ ప్రకాష్ చెబుతున్నారు. వీరవాసరం, యలమంచిలి, తణుకు అంబులెన్సులను పూర్తిగా నిలిపివేయగా ఎంతో అత్యాధునిక పరిజ్ఞానంతో ఉన్న లైఫ్‌సేవింగ్ సపోర్టు అంబులెన్సు నిలిపివేశామన్నారు. దూర ప్రాంతాలకు సర్వీసులు ఆపివేశామని, మండలం నుంచి సమీప ఆసుపత్రి వరకూ కొనసాగిస్తున్నామని, ఒక ఆసుపత్రి నుంచి మరొక ఆసుపత్రి రిఫరల్స్ నిలిపివేశామన్నారు. గురువారం నాటికి అంబులెన్సులన్నీ పూర్తిస్థాయిలో సేవలందించడానికి చర్యలు తీసుకుంటున్నామని మేనేజర్ ప్రకాష్ వెల్లడించారు.

108 సేవలు లేకపోవడంతో ఇదే అదనుగా తీసుకున్న ప్రైవేటు అంబులెన్సులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తున్నారని రోగుల బంధువులు వాపోతున్నారు. తక్షణం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఒక్కో వాహనానికి ఇద్దరు చొప్పున 200 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. ప్రతీ వాహనానికి రోజుకు 5 వేల రూపాయల డీజిల్‌ను నింపుతారు.

## పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు : జేసీ

ఏలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పక్కాగా, పారదర్శకంగా ధాన్యం సేకరణ నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందికి శిక్షణ అందించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 11 రైతుసేవా కేంద్రాల ద్వారా రూ.1.22 కోట్ల విలువైన 610 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో ఏదైనా సమస్య ఉంటే పరిష్కారానికి 77020 03584 నంబర్‌తో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. దీపం పథకం-2కి సంబంధించి ఇప్పటి వరకు 70 వేలమంది బుకింగ్ చేసుకోగా, 33 వేలమందికి సిలిండర్లు అందజేశామన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలుకు ఎంసీసీ బృందాలు

ఏలూరుసిటీ, 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం ప్రత్యేక అధికార బృందాలను నియమిస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. మునిసిపల్, మండల స్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ఈ బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. మున్సిపల్, మండలాల వారీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం 22 ఎంసీసీ బృందాలు, 21 స్పెషల్ వీడియో బృందాలు ఏర్పాటు చేశారు. భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, నిడమర్రు, పెదపాడు, చింతలపూడి, పెదవేగి, ఉంగుటూరు, లింగపాలెం, వేలేరుపాడు, పోలవరం, జీలుగుమిల్లి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం అర్బన్, రూరల్, బుట్టాయిగూడెం, ద్వారకాతిరుమల, కుక్కునూరు, టి.నరసాపురం, కొయ్యలగూడెం, మండలాలతో పాటు ఏలూరు కార్పొరేషన్‌లో రెండు ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా 21 ప్రత్యేక వీడియో బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల మార్గదర్శకత్వం కోసం ఎన్నికల ప్రవర్తనా నియమావళి జిల్లాలో అమలులోకి వచ్చిందన్నారు.

# ఆక్వా రైతులకు.. విద్యుత్ షాక్!



నిడమర్రులో ఏరియేటర్లు తిరుగుతున్న రొయ్యల చెరువు

ఆర్థిక భారంతో ఆక్వా రైతు కొట్టుమిట్టాడుతున్నాడు. సాగు కష్టాలకు తోడు విద్యుత్ ధరల షాక్‌తో మరింత భారం పడుతోంది. లాభాలు రాకపోగా తీవ్ర నష్టాలు మిగులుస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆర్థిక సంక్షోభం లో కూరుకుపోతున్న ఆక్వా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రధానం గా ఆక్వా రైతుపై విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలని, ట్రాన్స్‌ఫార్మర్లపై సబ్సిడీ పునరిద్ధరించాలని కోరుతున్నారు.

## రైతు నడ్డి విరుస్తున్న బిల్లులు

- కొందరికే విద్యుత్ సబ్సిడీ
- కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.లక్షల్లో మోత..
- ఓవర్ లోడ్ పేరుతో అదనపు డిపాజిట్ ..షార్ట్ బిల్లులతో బెంబేలు

నిడమర్రు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆక్వారంగంలో చెరువులకు వచ్చే విద్యుత్ బిల్లులు రైతుల నడ్డివిరుస్తున్నాయి. ఒక్కో చెరువుకు రైతులు వేలల్లో బిల్లులు కడుతున్నారు. ఐదెకరాల చేపల చెరువు రైతు నెలకు సరాసరి రూ.7 వేల నుంచి రూ.10 వేల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాడు. ఐదెకరాల రొయ్యల చెరువుకు రూ.18 వేల నుంచి రూ.25 వేల బిల్లు చెల్లించాల్సి వస్తోంది.

### కొందరు రైతులకే విద్యుత్ సబ్సిడీ

ఆక్వా రైతులకు అండగా ఉంటామంటూ మాయమాటలు చెప్పిన జగన్ ప్రభుత్వం రైతుల మధ్య విభజన రేఖ గీసింది. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ ప్రాంతాలుగా ఏర్పాటు చేసి విద్యుత్ సబ్సిడీని కేవలం ఆక్వా జోన్‌లో చెరువులకు మాత్రమే వర్తింపజేశారు. నాన్ ఆక్వా జోన్ చెరువులకు విద్యుత్ బిల్లులలో సబ్సిడీ మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఆక్వా చెరువులన్నింటికీ సబ్సిడీ అందజేస్తామని హామీ ఇచ్చింది. ఆక్వా చెరువుల న్నింటికీ సాగు విస్తీర్ణంతో సంబంధం లేకుండా విద్యుత్ బిల్లుల్లో సబ్సిడీ వర్తింప జేయాలని కోరుతున్నారు. పది ఎకరాలోపు ఆక్వా చెరువులకు విద్యుత్ సబ్సిడీ కింద యూనిట్ ధర రూ.1.50 మాత్రమే వసూలు చేస్తున్నారు. ఆపై విస్తీర్ణం ఉన్న రైతుల నుంచి యూనిట్ ధర రూ.3.85 వసూలు చేయడంతో అదనపు భారం పడుతోంది. అన్ని చెరువులకు విద్యుత్ సబ్సిడీ యూనిట్ ధర రూ.1.50 చొప్పున ఇవ్వాలని కోరుతున్నారు.

**ట్రాన్స్‌ఫార్మర్లకు ధరల దోపిడీ (రూపాయల్లో)**

| సామర్థ్యం | టీడీపీ హయాంలో | వైసీపీ హయాంలో | పెరిగిన ధర |
|---|---|---|---|
| 25 కేవీ | 64,000 | 3,24,000 | 2,60,000 |
| 40 కేవీ | 1,14,000 | 4,96,000 | 3,82,000 |
| 63 కేవీ | 2,20,000 | 5,25,000 | 3,05,000 |
| 100కేవీ | 3,56,000 | 8,30,000 | 4,74,000 |

### సర్‌చార్జీల మోత

2014లో విద్యుత్ ఛార్జీలు విషయంలో తక్కు. వ దరకు విద్యుత్ అందించామని ఇప్పుడు సర్‌చార్జీల మోత మోగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ పాలన చివరి సంవత్సరంలో ఆక్వా రైతుల నుంచి సర్‌చార్జిల పేరుతో వేలల్లో సొమ్ము వసూలు చేశారు. ఎస్‌పీసీపీ 1, ఎస్‌పీసీపీ 2 పేరుతో చార్జీల మోతతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ సర్‌చార్జీలను తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు.

**ఏలూరు జిల్లాలో ఆక్వా చెరువులు**
(రొయ్య, చేపల చెరువుల కలిపి)
సుమారు 1.25 లక్షల ఎకరాలు
విద్యుత్ సర్వీసులు : సుమారు 15 వేలు

**భీమవరం జిల్లాలో ఆక్వా చెరువులు**
సుమారు 1.75 లక్షల ఎకరాలు
విద్యుత్ సర్వీసులు : సుమారు 24 వేలు

### కొత్త ట్రాన్స్‌ఫార్మర్ భారం

వైసీపీ ప్రభుత్వం హయాంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌పై సబ్సిడీ పూర్తిగా తొలగించారు. వైసీపీ పెద్దల సొంత సంస్థ షిరిడీ సాయి ఇండస్ట్రీకి ట్రాన్స్‌ఫార్మర్ల కాంట్రాక్టు అప్పజెప్పి వాటి ధర నాలుగు రెట్లు పెంచేసింది. అంతకు ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వేసుకోవాలంటే రూ.1.5 లక్షలు ఖర్చు కాగా వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ తొలగించి ధర పెంచడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.4 లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ గతంలో రూ.4లక్షలు కాగా రూ.8లక్షలకు పెంచేశారు. వైసీపీ ప్రభుత్వం 2019 నుంచి 2021 వరకు యూనిట్‌కు రూ.1.50 ధరకు ఇచ్చి తర్వాత నుంచి ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్, అనుమతులు, పది ఎకరాలలోపు షరతులతో రూ.3.85 వసూలు అమలు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృషిలో ఉంచుకొని పూర్వం టీడీపీ హయాంలో అమలు చేసిన విధంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సబ్సిడీ అందించాలని కోరుతున్నారు.

### ఓవర్ లోడ్ పేరుతో అధిక భారం

ఆక్వా రైతులకు అప్పుడప్పుడు విద్యుత్ శాఖాధికారులు షాకులు ఇస్తున్నారు. మీ చెరువు మీటరుపై అదనపు లోడ్ వాడుతున్నారని ఫైన్ లేదా అడిషనల్ డిపాజిట్ కట్టాలంటూ వేలల్లో బిల్లులు వేసి రైతు జేబుకు చిల్లుపెడుతున్నారు. అదనపు లోడ్‌కు సరిపడా డిపాజిట్ కట్టినా ఏటా ఇదే తంతు నడుస్తోంది. అదనపు లోడ్ చార్జీలు కట్టినా పాత ట్రాన్స్‌ఫార్మర్ మార్చి కొత్త లోడుకు సరిపడా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు మాత్రం ఏర్పాటు చేయడం లేదు.

### షార్ట్ బిల్లులతో రైతులు బెంబేలు

ఇటీవల విద్యుత్ సిబ్బంది కొత్త విధానం పేరుతో షార్ట్ బిల్లు వసూలు చేస్తున్నారు. డిజిటల్ టెక్నాలజీతో గతంలో మీరు చెల్లించిన బిల్లులు షార్ట్ అయ్యాయని సరాసరి మొత్తం ఇంత చెల్లించాలని అదనంగా వసూలు చేస్తున్నారు. నిత్యం విద్యుత్ ఆధారంతో చెరువులు నడవాలి కనుక వారు చెప్పిన మొత్తం చెల్లించాల్సిందే. షార్ట్ బిల్లులపై రైతులకు ఇప్పటికీ స్పష్టత లేదు.

### అన్ని చెరువులకు సబ్సిడీ అమలు చేయాలి



ప్రస్తుతం ఆక్వా రంగం తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. రొయ్యలు, చేపల సాగు చెరువులో ఉన్నా లేకపోయినా కరెంటు బిల్లు మాత్రం కట్టాల్సివస్తోంది. విద్యుత్ బిల్లుల్లో యూనిట్ సబ్సిడీ అన్ని చెరువులకు వర్తింపచేయాలి. కూటమి ప్రభుత్వ పెద్దలు ఆక్వా రైతుల కష్టాలను పట్టించుకొని సబ్సిడీలు అందించి చితికిపోతున్న ఆక్వా రంగాన్ని మళ్ళీ పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేయాలి.

\- జి.వి. సుబ్బరాజు ప్రధాన కార్యదర్శి పశ్చిమ గోదావరి ఫ్రాన్స్ ఫార్మర్స్ అసోసియేషన్ భీమవరం

### సర్‌చార్జిలు దారుణం..



గత ఇరవై ఏళ్ల నుంచి రొయ్యలు, చేపలు చెరువులు సాగు చేస్తున్నాను. గతంలో ఆక్వా రంగానికి నాణ్యమైన విద్యుత్ అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేయాలంటే కేవలం రూ.65 వేల నుంచి రూ.3.40 లక్షల లోపు అయ్యేవి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు విషయమై సబ్సిడీని అందిస్తే రైతుకు మేలు జరుగుతుంది. సర్‌చార్జీల పేరుతో 2014 నాటి విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ సర్‌చార్జిలు వసూలు చేయడం దారుణం. షార్ట్ బిల్స్, ఓవర్ లోడ్ డిపాజిట్‌ల విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి.

\- సంకు నాగ శేషు, ఆక్వా రైతు భువ్వనపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప శివకిశోర్

## బాధితుల పట్ల మర్యాదగా నడుచుకోవాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల అధికారులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ హెచ్చరించారు. జిల్లా నేర సమీక్షా సమావేశాన్ని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను పరిష్కార పరిమితి గడువు లోపు పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో శాంతికమిటీ లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల కేసు లను తెలుసుకుని వాటి దర్యాప్తుకు సూచన లు, ఆదేశాలు జారీ చేశారు. ఏఎస్పీ సూర్య చంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ శేఖర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

ఏలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానాన్ని ఎత్తివేయాలని, సెమిస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, హాస్టల్లో పెండింగ్ మెస్ చార్జీలను విడుదల చేయాలని, అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వై.ఉదయ్, లోకేశ్, నవదీప్, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.





నూజివీడులో ఆధార్ సవరణకు విద్యార్థుల తల్లిదండ్రుల పడిగాపులు

# అపార్ నమోదుకు.. అష్టకష్టాలు!

- తప్పుల తడకగా ఆధార్‌లో వివరాలు
- డిజిటల్ కార్డుల జారీలో అడ్డంకులు

నూజివీడు/ఏలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒక దేశం, ఒక స్టూడెంట్ కార్డు పేరుతో జాతీయ నూతన విద్యావిధానం, 2020లో భాగంగా కేంద్రం తెచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల వివరాలు అడ్మిషన్ రిజిస్ట్రార్‌తో పాటు యుడేస్‌లో పొందుపరచాలి, సంబంధిత కోడ్ నమోదు చేయగానే, విద్యార్థి వివరాలు అన్ని వస్తాయి. అపార్ నమోదు సమయంలో ఆధార్‌ను వినియోగించడం, అందులో వివరాలు తప్పుగా ఉండడంతో నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. పేరు, పుట్టిన తేదీ, తండ్రిపేరు, అడ్మిషన్ రిజిస్ట్రర్, యుడైస్‌లతో వేర్వేరుగా ఉండడంతో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌లలో తప్పులను సరిచేసుకునేందుకు ఆధార్ సెంటర్, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అపార్ మార్పుడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తే తప్ప ఆ ప్రక్రియ సజావుగా జరగదని, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

### అపార్ కార్డు ఎంతో కీలకం

చాలామంది విద్యార్థుల వివరాలు, పాఠశాల రికార్డులో ఒకలా, ఆధార్ కార్డులో మరోలా ఉన్నాయి. కేంద్రం జారీ చేస్తున్న అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందులో నమోదై ఉంటాయి. ఒకసారి అపార్‌కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూరై, ఉద్యోగం సాధించే వరకు ఇదే నంబర్ కార్డు ఉంటుంది. శాశ్వత డిజిటల్ గుర్తింపు సంఖ్యతో దేశంలో ఎక్కడ చదవాలన్నా ఉపాధి అవకాశాలకు సంబంధించి ఈ కార్డు కీలకం కానుంది.

### ఆధార్ కేంద్రాల్లో వీలు కాక

సచివాలయాల కేంద్రాలుగా కళాశాల, పాఠశాల విద్యార్థులు ఆధార్ సమస్యలను పరిష్కరించేందుకు గత నెలలో ఆధార్ నమోదును ప్రారంభించారు. అక్కడ చిన్నచిన్న పొరపాట్లు మాత్రమే పరిష్కరిస్తుండగా, ప్రధాన సమస్యల పరిష్కారానికి జనన ధ్రువపత్రాలు తప్పనిసరిగా అడుగుతున్నారు. పాఠశాల స్టడీ సర్టిఫికెట్, గెజిటెడ్ సంతకం ఉన్న వాటిని అంగీకరించడం లేదు. దీంతో గ్రామీణ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఏలూరు రూరల్ మండలంలో పాఠశాలలో విద్యార్థులకు అపార్ కార్డుల జారీకి కష్టాలు తప్పడం లేదు. మండలంలో ఐదు జిల్లాపరిషత్, 22 మండల పరిషత్, రెండు యూపీ పాఠశాలలు ఉన్నాయి. 2166 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ఏలూరు ఆధార్ కేంద్రాలకు వచ్చి తప్పులు సరిచేసుకోవాల్సి వస్తోంది. ఇప్పటివరకు 45శాతం అపార్ నమోదు పూర్తయిందని ఎంఈవో రంగయ్య పేర్కొన్నారు. విద్యార్థులకు ఆధార్ జారీచేసేటప్పుడు చాలామందికి పుట్టిన సంవత్సరం,పేరు,చిరునామా వంటి వివరాల్లో తప్పులు ఉంటే అపార్ రిజిస్ట్రార్ కావడం లేదని రంగయ్య తెలిపారు.

### లక్షల మంది విద్యార్థుల ఇబ్బంది

ఏలూరు జిల్లావ్యాప్తంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు సుమారు మూడున్నర లక్షల వరకు విద్యార్థులు ఉన్నారు. వారిలో అనేకమంది గ్రామీణ విద్యార్థులు ఉండడం, తల్లిదండ్రులు నిరక్ష్యరాస్యులు కావడంతో పుట్టిన తేదీల సమస్య, డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లలో పేర్లలో తప్పులు దొర్లుతున్నాయి. మరోవైపు తల్లిదండ్రుల సంతకం ఉంటేనే అపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో అపార్ నమోదు కావడం లేదు. 'ఆధార్ కేంద్రానికి వెళితే సవరణ తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం కావాలని చెబుతున్నారు. అందులోనూ తప్పులు ఉంటున్నాయి. జనన ధ్రువపత్రంలో తప్పులు సరిచేయాలంటే ఆధార్ కార్డు అడుగుతున్నారు. ఏం చేయాలో తెలియడం'.. లేదంటూ తల్లిదండ్రులు వాపోతున్నారు.

### బ్యాంకుల వద్ద పడిగాపులు

అపార్ నమోదుకు ఆధార్ సవరణ చేయాల్సిన నేపథ్యంలో అనేకమంది తమ చిన్నారులతో బ్యాంకుల్లోని ఆధార్ నమోదు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ పనిచేయని పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారు బయట దుకాణాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

## అపార్' నమోదును 24 గంటల్లో పూర్తిచేయండి : కలెక్టర్

ఏలూరు అర్బన్ : జిల్లావ్యాప్తం గా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల ల్లో ఇంటర్మీడియట్‌వరకు చదువుతున్న విద్యార్థులకు 'అపార్' డేటా నమోదును యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని ఎంఈవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆదేశించారు. అపార్ నమోదులో జిల్లాను ముందుంచడానికి 24 గంటల గడువు ఉందని, ఈలోగా నూరుశాతం పూర్తిచేసి నివేదికను అందజేయాలన్నారు. అపార్ డేటా నమోదులో భాగంగానే జిల్లావ్యాప్తంగా 34 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పుట్టినతేదీ ధ్రువపత్రం లేనివారు ఆర్డీవో నుంచి సర్టిఫికెట్‌ను పొందవచ్చన్నారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఈవో వెంకటలక్ష్మమ్మ, మునిసిపల్ కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.



అపార్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్

### 'అపార్' నమోదు పరిశీలన

'అపార్' డేటా నమోదు ప్రక్రియను బుధవారం ఏలూరు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలును సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అపార్ నమోదు ప్రక్రియలో భిగంగా విద్యార్థి ఆధార్ కార్డులోని వివరాలు, పాఠశాల రిజిస్టర్‌లోని వివరాలు, యు-డైస్ డేటాలోని వివరాలు ఒకేలా ఉండాలన్నారు. అనంతరం స్కూలులో విద్యార్థుల హాజరుపట్టీ, పారిశుధ్యం, మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. హెచ్‌ఎం కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ శేషగిరి, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను జయిద్దాం..

**నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం**




**ప్రమాదకర వ్యాధుల్లో క్యాన్సర్‌ను ప్రముఖంగా చెబుతారు. ఇప్పుడు ఆరోగ్యరీత్యా ప్రభావితం ఏస్తున్న ప్రధాన వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. వయసుతో నిమిత్తం లేకుండా పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ క్యాన్సర్ వెంటాడుతూనే ఉన్నది. కాలుష్యం, అపరిశుభ్రత, హానికరమైన రసాయనాల ప్రభావంతో కూడిన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆమోదయోగ్యం కాని అలవాట్లు క్యాన్సర్ కారకాలుగా ఇటీవలి కాలం వరకు వైద్య పరిశోధనలు చెబుతుండగా ఇపుడు ఒబేసిటీ, జంక్‌ఫుడ్స్, విచ్చలవిడి శృంగారం వంటివన్నీ క్యాన్సర్‌కు దారితీస్తున్నాయని అంకాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..**

ఏలూరు అర్బన్/ పాలకొల్లు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌కు దారితీసే 70 శాతం కారకాలు నివారించ దగ్గవిగా తెలిసినప్పటికీ తొలిదశలో గుర్తించలేకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదాలు ఉన్నాయి. ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా వ్యాధిని నయం చేసే అవకాశాలు ఉన్నాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఒకప్పుడు 40 ఏళ్ళ పైబడిన వారిలో కనబడే క్యాన్సర్ ఇపుడు పిల్లల్లోను విస్తరిస్తోందని చెబుతున్నారు.క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, పౌష్టికాహారం, మానసిక ప్రశాంతత ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండ వచ్చునని, అదే సమయంలో క్యాన్సర్ సోకినవారు భయ పడాల్సిన పరిస్థితులు లేవని ఆధునిక చికిత్సా విధానాలతో వారి జీవితకాలాన్ని పొడిగించవచ్చునని భరోసా ఇస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలో లెక్కలివీ..

క్యాన్సర్ బాధితులకు అందుతున్న వైద్యసేవలు, వారి పరిస్థితులు తదితర అంశాలను పర్య వేక్షించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఇంతవరకు ప్రత్యేక యంత్రాంగమంటూ ఏదీ లేదు. అయితే గతేడాది వరకు వైద్య ఆరోగ్యశాఖ వద్ద నమోదైన క్యాన్సర్ రోగులసంఖ్య 2981 . వీరిలో 2264 మంది మహిళలు కాగా, 717 మంది పురుషులు. ఉమ్మడిజిల్లాలో క్యాన్సర్ చికిత్సల కోసం ప్రత్యేకంగా ఏలూరు శివారు వంగాయగూడెంలో 16 ఏళ్ళక్రితం ప్రారంభించిన గుడ్ సమ రిటన్ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఇప్పటివరకు 19,750 మంది మహిళలు, పురుషులు రిజిస్టర్ అయివున్నారు. ఇక్కడి ఆస్పత్రికి అవుట్ పేషెంట్లుగా రోజుకి మూడు విభాగాల్లో 140 మంది వైద్యం పొందుతుండగా, ఇన్‌పేషెంట్లుగా దీనికి మరో నాలుగైదు రెట్లు చికిత్సలు తీసుకుంటున్నారు. పొరుగు జిల్లాల నుంచి కూడా చికిత్స కోసం ఇక్కడికి వస్తున్నారు.



### గోదావరి జిల్లాల్లో క్యాన్సర్ దారులిలా...

ఉభయగోదావరి జిల్లాల్లో కొన్ని రకాల క్యాన్సర్ వ్యాధి వేగంగా విస్తరిస్తోన్నట్టు అంకాలజిస్టులు చెబుతున్నారు. ఇక్కడి గ్రామీణ ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి స్థిరపడిన పేద కుటుంబాల్లో మహిళలు పొగాకు ఉత్పత్తులను రివర్స్ పద్ధతిన నోటిలో పెట్టుకుని పొగను గొంతుగుండా లోపలికి తీసుకుంటుండటం వల్ల వాటిలోని విషపూరిత రసాయనాల ప్రభావం కారణంగా నోటి క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్‌లకు గురవుతున్నట్టు తమ పరిశీలనలో గమనిస్తున్నామని వైద్యనిపుణులు వివరించారు. దూమ పానంలో రివర్స్ స్మోకింగ్ అత్యంత ప్రమాదకరమని, ఈ ప్రక్రియలో బయటకు వదలాల్సిన పొగ నేరుగా శరీరంలోకి, తద్వారా రక్తం, ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి అత్యంత వేగంగా క్యాన్సర్‌కు గురిచేస్తుందన్నారు. దీంతో పాటు గుట్కా వంటి నోటితో నమిలే పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా యువతలో నోటిక్యాన్సర్‌కు దారితీస్తోందని హెచ్చరిస్తున్నారు. ఇక మద్యపానం సేవనం మోతాదుకు మించి గోదావరి జిల్లాల్లో అన్నివర్గాల్లో ఉంటుండటం అన్నవాహిక క్యాన్సర్‌కు ప్రధాన కారణంగా వైద్య వర్గాలు విశ్లేషించాయి. పది అంగుళాల పొడవు, కండరాలతో కూడిన అన్నవాహిక క్యాన్సర్‌కు గురైతే ఊపిరితిత్తులు, కాలేయం, కడుపు, ఇతర శరీర భాగాలకు కూడా వ్యాప్తి చెందటం సహ జంగానే జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో వేగంగా విస్తరిస్తోన్న క్యాన్సర్ రకాల్లో ఇది రెండో స్థానంలో ఉందని అంకాలజిస్టులు చెబు తున్నారు. గోదావరి జిల్లాల మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ లక్షణాలతో కూడిన కేసులు ఎక్కువవు తున్నాయి. దూమపానంతో పాటు, బలహీనమైన రోగనిరోదక శక్తి, లైంగిక వ్యాధులు, ఏళ్ళ తరబడి గర్భనిరోధక మాత్రలు వినియోగం, జీవిత భాగ స్వామితో కాకుండా అపరిచితులతో లైంగిక సంబంధాలు వంటివన్నీ గర్భాశయ క్యాన్సర్‌కు దారితీస్తాయి. 40 సంవత్స రాల వయసు దాటిన మహిళలు క్యాన్సర్ బారిన పడు తున్నట్టు వైద్యుల పరిశీలనలో తేలింది. గోదావరిజిల్లాలో ఈ మూడు రకాల క్యాన్సర్ వ్యాదుల వ్యాప్తి ఎక్కు వగా ఉన్నట్టు వైద్యనిపుణులు వివరించారు. కొంతకాలం క్రితం వరకు క్యాన్సర్ 40 ఏళ్ళ పైబడిన వయస్కుల్లోనే ఎక్కువగా వ్యాప్తి చెందు తున్నట్టు తాము గమనించామని, దీనికి భిన్నంగా ఇటీవలి కాలంలో చిన్నవయసులో బాలికలు కూడా క్యాన్సర్ బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు.


వంగాయగూడెంలో క్యాన్సర్ ఆసుపత్రి

### గోదావరిజిల్లాల్లో బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ కేసులే ఎక్కువ

### నాలుగింట మూడొంతులు మహిళలే

### వయసుతో నిమిత్తం లేకుండా వ్యాధి

### మారిన జీవనశైలి ప్రధాన కారణం

#### ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే

ఆందోళనకర స్థాయికి విస్తరిస్తోన్న క్యాన్సర్‌ను నివారించడం లేదా నియంత్రించడానికి తగిన చర్యలు చేపట్టేందుకు తొలిసారిగా రాష్ట్రప్రభుత్వం క్షేత్రస్థాయి సర్వేను చేపట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలో కొద్దిరోజుల వ్యవధిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారి నేతృత్వంలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్‌తో కూడిన బృందాలను ఏర్పాటు చేసి అన్ని గ్రామీణ, పట్టణప్రాంతాల్లో ఇంటింటి సర్వేను చేపట్టను న్నారు. దీనికోసం ఇప్పటికే 140 మంది వైద్యాధి కారులు, 463 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 751 మంది ఏఎన్ఎంలు, 1700 మంది ఆశావర్కర్లకు బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ల స్క్రీనింగ్‌పై శిక్షణ నిచ్చారు. ఈ బృందాలు ఇంటింటికీ వెళ్ళి క్యాన్సర్ అనుమానిత లక్షణాలున్నవారిని గుర్తించి స్థానిక పీహెచ్‌సీకి రిఫర్ చేస్తాయి. సంబంధిత మెడికల్ ఆఫీసర్ పరిశీలనలో నిర్ధారణ అయితే, తదుపరి ఆ కేసును ఏరియా హాస్పిటల్ లేదా జిల్లా సర్వజన ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తారు. ఈ సర్వేవల్ల జిల్లాలో క్యాన్సర్ బాధితుల సంఖ్య, ప్రస్తుత పరిస్థితి వంటి సమగ్ర సమాచారం లభిస్తుందని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు తెలిపాయి. జిల్లాలో వారం రోజుల వ్యవధిలో ఈ సర్వేను క్షేత్రస్థాయిలో ప్రారంభించనున్నారు.

### లక్షణాలను గుర్తించడమెలా..



నోరు, శరీరంపై దీర్ఘకాలంగా మానని పుండు ఉంటే అనుమానించవచ్చు. మల ద్వారం లేదా మర్మా వయవాల నుంచి రక్త స్రావం జరుగుతుంటే పెద్దపేగు, ప్రొస్టేట్ అవయవాల క్యాన్సర్ లక్షణాలుగా చెబుతారు. రొమ్ములో ఏదైనా కణజాలం పెరిగి మందంగా మారడం, జీర్ణప్రక్రియ సరిగా జరగక పోవడం లేదా మింగటంలో కడుపులో ఇబ్బంది క్యాన్సర్‌కు సూచికలే. పుట్టుమచ్చలు, పులిపిరులు వంటివాటిలో గమ నించదగ్గ మార్పులు, దగ్గు తరచూ రావడం లేదా గొంతు బొంగురు పోవడం వంటి లక్షణాలు క్యాన్సర్‌కు దారితీయవచ్చునని అంకాలజిస్టులు వివరించారు. శరీరంలో ఏదైనా భాగంలో నొప్పి స్థిరంగా ఉండటం,ఎటువంటి కారణం లేకుండా ఆకస్మికంగా బరువు తగ్గడం. అన్ని వేళలా విపరీతమైన అలసట.. తరచూ జ్వరం రావడం వంటివి , చర్మం రంగులో మార్పులు, శరీరంలో ఏదైనా భాగంలో గెడ్డలు ఏర్పడటం.. ఏభాగం నుంచైనా అధికరక్తస్రావం కావడం గమనిస్తే అనుమానించాలి.చర్మం లేదా నోటిపై పుండ్లు, పూత ఏర్పడటం తదితర లక్షణాలు ఉంటే క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఆయా ఇబ్బందుల తీవ్రతను బట్టి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా వ్యాధి మూలాలు తెలుస్తాయి.

### బీమాతో.. ధీమా

క్యాన్సర్ అనేది ప్రమాదకరమైన, ఖర్చుతో కూడుకున్న వ్యాధి. దీనికి భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)తో పాటూ పలు బీమా సంస్థలు రక్షణ కల్పిస్తున్నాయి. ఎల్ఐసి క్యాన్సర్ కవర్ పాలసీ కనిష్టంగా రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షలకు బీమా సౌకర్యం ఇస్తోంది. ఈ పాలసీలో లెవిల్ సమ్ ఎష్యూర్డ్‌తో పాటూ పరిమిత బీమా సౌకర్యం అందుబాటులో ఉంది. 20 ఏళ్ల నుంచి 65 సంవత్సరాల వరకూ పాలసీ పొందవచ్చు. టాటా ఏఐజి క్యాన్సర్ పాలసీలను అందిస్తోంది. కేర్ హెల్త్ క్యాన్సర్ ఇన్సూరెన్స్, హెచ్.డి.ఎఫ్.సి., ఆదిత్య బిర్లా ఇంకా పలు కంపెనీలు క్యాన్సర్ బీమా రక్షణకు పాలసీలను అమ్ము తున్నాయి. క్యాన్సర్ బారినపడిన పాలసీదారులకు జీవించి ఉన్నంత కాలం వైద్యంతో పాటూ బీమా సొమ్మును అంద జేస్తాయి. ఇటీవల కాలంలో గుండె సంబంధిత మరణాల తరువాత క్యాన్సర్ మరణాలు పెరుగుతున్నాయి. గత రెండేళ్లలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. ఈ కారణాల రీత్యా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు శరీరంలో కనిపించకుండా ఉండగానే (ఆరోగ్యంగా ఉండగానే) క్యాన్సర్ కవర్ పాలసీలు తీసుకోవడం మేలని బీమా రంగ నిపుణులు సూచిస్తున్నారు. హెల్త్ పాలసీల కంటే క్యాన్సర్ పాలసీలకు ప్రీమియం తక్కువగా ఉంటుంది. సుమారు 100 పైబడిన క్యాన్సర్ చికిత్సలకు బీమా వర్తిస్తుంది.

### ఈ ఐదూ పాటిస్తే క్యాన్సర్‌కు దూరం



రేడియేషన్ చికిత్స వల్ల క్యాన్సర్ రోగులకు సైడ్ ఎఫెక్ట్‌లు, తీవ్రమైన నొప్పులు ఉంటాయన్నది ఒకప్పటి మాట. ఇప్పుడు అడ్వాన్స్‌డ్ ప్రొసీజర్లు అందుబాటులోకి రావడంతో నొప్పి తీవ్రతను గణ నీయంగా తగ్గించ వచ్చు. క్యాన్సర్‌కు దూరంగా ఉండాలంటే ఐదు ఆరోగ్య చిట్కా లను పాటించడం శ్రేయస్కరం. వయసుకు తగినవిధంగా వ్యాయామం, పోషక విలువలతో కూడిన తాజా ఆహారం, గ్రీన్‌టీ/ లెమన్ వాటర్, రోజుకు కనీసం 7 గంటల పాటు మంచి నిద్ర, మనసుకు నచ్చినవిధంగా ప్రశాంతతతో కూడిన సంగీతం వింటూ ధ్యానం చేయడం..ఈ ఐదు సూత్రాలను అనుసరిస్తే సాధారణ ప్రజలకు క్యాన్సర్ సోకే అవకాశాలు చాలా అరుదు.

**- డాక్టర్ మనోజ్‌కుమార్ యాదవ్, రేడియేషన్ అంకాలజిస్టు**

### స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటుండాలి



ఇపుడు వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ వస్తోంది. జీవన శైలిలో మార్పులు, దూమ పానం, ఫాస్ట్ ఫుడ్స్ వల్ల వేగంగా విస్తరిస్తోంది. సాధారణ పరీక్షలతో పాటు మహిళలైతే మామోగ్రాఫ్, సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వారం) స్క్రీ నింగ్ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. పురుషులైతే ప్రొస్టేట్, కొలాన్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను చేయించు కోవాలి. క్యాన్సర్ సోకిన తర్వాత వెంటనే వైద్య నిపుణులను సంప్రదిస్తే తొలిదశ చికిత్సలతోనే చాలా వరకు నివారణ, నియంత్రణ చేయవచ్చు. 9-13 సంవత్స రాల బాలికలు సర్వైకల్ క్యాన్సర్‌కు గురికాకుండా భద్రత పొందేందుకు ఇపుడు వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది.

**కె.చంద్రశేఖరరావు, సర్జికల్ అంకాలజిస్టు**

### జీవనశైలి మారాలి



జీవనశైలి మార్చుకోవాలి.జంక్ ఫుడ్ మానాలి. కలుషిత ఆహారం వల్లనే పేగు సంబంధిత క్యాన్సర్‌లు వస్తున్నాయి.వ్యాయామం చేయడం, మద్యం, ధూమపానాలకు దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్ బారినపడకుండా ఉండ వచ్చు.తొలిదశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే క్యాన్సర్‌ను జయించవచ్చు.

**డాక్టర్ రమేష్, ఎండీ, పాలకొల్లు**

### ప్లాస్టిక్, పాలిథీన్ వినియోగం తగ్గించాలి



ఆహార పదార్థాలను క్యారీ బ్యాగుల్లో తెచ్చుకుని తినడం ఫ్యాషన్‌గా మారింది. ఫంక్షన్లలో ప్లాస్టిక్, పాలిథీన్‌లను మితిమీరి వినియోగిస్తున్నారు. ఇవి కాన్సర్‌కు దారి తీస్తాయి. స్ట్రీట్ ఫుడ్‌లలో కాక నూనె వినియోగిస్తున్నారు. దీనిద్వారా క్యాన్సర్ సంక్రమించవచ్చు. 40 ఏళ్లు దాటిన మహిళలు ప్రతిఏటా మామోగ్రఫీ చేయించుకోవాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధిని గుర్తించవచ్చు.

**-డాక్టర్ ముత్యాల సిరిచందన, డీఎన్‌బీ జనరల్ మెడిసిన్, పాలకొల్లు**


ద్వారకాతిరుమలలో పాలు అమ్ముతున్న మహిళ

## గాడిద పాలు..కొంటారా

### లీటరు రూ.2 వేలు పైబడే..

ద్వారకాతిరుమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):కోపం వస్తే గాడిద అని తిట్టడం.. ఎక్కువ పనిచేయిస్తే గాడిద చాకిరీ .. అనుకోవడం సర్వసాధారణం. అయితే ఇపుడు అలా అనుకోవడానికి కూడా గాడిదలు చాన్స్ ఇవ్వడం లేదు. ఎందు కంటే వాటికి ఉన్న గిరాకీ అలా ఉంది మరి.. గాడిద పాలలో అనేక ఔషదగుణాలు కల్గి ఉన్నాయని ప్రచారం ఉండటంతో మంచి డిమాండ్ పలుకుతోంది. పెద్దలు, పిల్లలకు దగ్గు, ఆయాసం, ఉబ్బసం, ఆకలి లేక పోవడం వంటి వ్యాదులు తగ్గడానికి గాడిద పాలు బాగా పనిచేస్తాయని చెప్తుండడంతో ఈపాలకు డిమాండ్ ఎక్కువే.అవకాశాన్ని బట్టి లీటర్ రూ. 2వేలు పైబడి అమ్ముతుంటారు. ద్వారకా తిరుమలలో బుధవారం గాడిదపాల అమ్ముతూ ఒక మహిళ వచ్చింది. ఇంటికే గాడిదను తీసుకెళ్లి అక్కడికక్కడే పాలు పిండి ఇస్తోంది. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన వీరు మైక్‌లో అనౌన్స్ చేస్తూ మరీ ఈ అమ్మకాలు సాగించారు. తమ వద్దనున్న పెద్దగిన్నెడు పాలు రూ.900, చిన్నగిన్నెడు రూ.600 చొప్పున విక్రయించారు. దీర్ఘకాలిక వ్యాదులతో బాదపడే పెద్దలు, పిల్లలు వీటిని సేవిస్తే మంచి ఆరోగ్యం కలుగుతుందని జోరుగా ప్రచారం సాగడంతో పాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

## క్షీరారామంలో అయోధ్య రాముని విల్లు



పాలకొల్లు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య రామాలయానికి సమర్పించేందుకు తీసుకువెళుతున్న వెండి విల్లు, బాణాన్ని బుధవారం పాలకొల్ల క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల దర్శనార్థం ఉంచారు.తెనాలికి చెందిన శాస్త్రి అనే భక్తుడు వెండి విల్లు, బాణం తయారు చేయించి, రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి భక్తుల దర్శనార్థం ప్రదర్శిస్తున్నారు. శాస్త్రి బృందానికి ఆలయ మర్యాదలతో ఈవో, సిబ్బంది, అర్చకస్వాములు స్వాగతం పలికారు. వందలాది మంది భక్తులు విల్లు, బాణం సందర్శించారు. ఈవో శ్రీనివాస రావు, సూపరింటెండెంట్ వాసు, అర్చకులు పాల్గొన్నారు.





పోటీలను ప్రారంభించిన తాడేపల్లిగూడెం డీవైఈవో రవీంద్ర భారతి.. హైజంప్ చేస్తున్న విద్యార్థి

## కైకరంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్రారంభం

ఉంగుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో బుధవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న తాడేపల్లిగూడెం డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. విద్యా కమిటీ చైర్మెన్ అల్లూరి జగదీశ్వరి, వైస్ చైర్మెన్ సిరిపిరెడ్డి బలరాం, ఒలింపిక్ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ, పోటీల పరిశీలకుడు ప్రసాదరెడ్డి, హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ కే.అలివేలు మంగ, నియోజకవర్గ బాధ్యులు నారాయణ, సీనియర్ నాయకులు ముత్తంగి వేణుగోపాల కృష్ణ ప్రసాద్, గుత్తికొండ వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### అండర్-14 అథ్లెటిక్స్ విజేతలు

విజేతల వివరాలను పోటీల పరిశీలకుడు ప్రసాదరెడ్డి ప్రకటించారు. బాలికల విభాగం హైజంప్‌లో విశాఖ జిల్లాకు చెందిన బి.ఇషానా ప్రథమ స్థానం పొందగా భావన (తూర్పు గోదావరి) ద్వితీయస్థానం, కే.లక్ష్మీ ప్రియ (చిత్తూరు) తృతీయస్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో జి.కొండలలక్ష్మి (తూర్పు గోదావరి) ప్రథమ, ఎం.రిషిత (కర్నూల్) ద్వితీయ, పి.మానస (శ్రీకాకుళం) తృతీయస్థానం పొందారు. షాట్‌పుట్‌లో ఎం.కరిష్మా (గుంటూరు) ప్రథమ, పి, రితిక (నెల్లూరు) ద్వితీయ, డి.లాస్య (చిత్తూరు) తృతీయ స్థానం పొందారు.బాలురు అండర్-14 విభాగం హైజంప్‌లో వి.రాఘవేంద్ర (విజయనగరం)ప్రథమ డి.రహీం (ప్రకాశం) ద్వితీయ, కే.రాఘవేంద్ర(వైఎస్సార్ కడప) తృతీయ స్థానం పొందారు. లాంగ్ జంప్‌లో ఎం.పెంచల్ బాబు (కడప) ప్రథమ, పి,రాజేష్ (విశాఖ పట్నం) ద్వితీయ, డి.వెంకటేశ్ (ప్రకాశం) తృతీయ స్థానం పొందారు. షాట్‌పుట్‌లో జి.చంద్రశేఖర నాయుడు (విశాఖపట్నం) ప్రథమ, బి.భరత్ చంద్ర (శ్రీకాకుళం) ద్వితీయ, వి.గణేష్ (శ్రీకాకుళం)తృతీయ స్థానం సాధించారు. డిస్క్ త్రోలో జి.చంద్రశేఖర నాయుడు (విశాఖ) ప్రథమ బి.వెంకటేష్ (కర్నూలు)ద్వితీయ, టి.వి స్నేంట్ (ప్రకాశం) తృతీయ స్థానం పొందారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సెక్రటరీ నిశాంత్‌వర్మ...సీఎస్ఎన్ కళాశాల సెక్రటరీ సత్యనారాయణ

## జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో త్వరలో జైపూర్‌లో జరగబోయే నెట్‌బాల్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో జేఎన్టీయుకే తరపున ఎస్ఆర్‌కెఆర్ క్రీడాకారులు ఎంపికైనట్టు కళాశాల సెక్రటరీ నిశాంత్‌వర్మ తెలిపారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఇటీవల తమ కళాశాలలో జెఎన్టీయుకే అంతర్ కళాశాలల సెంట్రల్ జోన్ పోటీలు జరిగాయన్నారు. ఆ పోటీలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెన్, ఉమెన్ టీమ్స్‌లో కూడా ప్రథమ స్థానం సాధించారన్నారు. మహిళల టీమ్‌లో పీఆర్ విజయ సాహిత్య, ఆర్.అఖిల శ్రీవల్లి, .దేవిశ్రీ,చైతన్య లహరి, పురుషుల టీమ్‌లో జోషి, ప్రమోద్ కుమార్, లిఖిత్‌చౌదరి, తేజప్రభాష్ ఉన్నారని చెప్పారు. కళాశాల డైరెక్టర్ జగపతిరాజు, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

### సీఎస్ఎన్ కళాశాల విద్యార్థులు

డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల నుంచి స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-17 నెట్‌బాల్ పోటీలకు జి.త్రినాథ్, రాజేష్, వినీల వర్షిని, దీప్తిషలు ఎంపియ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్ తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు అండర్-17 రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు.

## జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఏలూరు విద్యార్థులు



ఏలూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి) :తెనాలిలో ఈనెల 2 నుంచి 4వ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఏలూరు ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు పతకాలు సాధించి జాతీయస్థాయి ఎంపికయ్యారని స్కూలు హెచ్ఎం ఉజ్వల, ఫిజికల్ డైరెక్టర్ పుల్లారావు ఓ ప్రకటనలో తెలిపారు.

# పుష్కరాలకు ముందస్తు కసరత్తు

**గోదావరి పుష్కరాలకు ప్రణాళికలు**

**పనుల ప్రతిపాదనలో అధికార యంత్రాంగం**

**వచ్చే ఏడాది నుంచి పనులు ప్రారంభించేందుకు కసరత్తు**

**గోదావరి పరివాహక ప్రాంతాలకు ప్రాధాన్యం**

**భక్తుల అంచనాలకు అనుగుణంగా స్నానాల రేవులు**

నరసాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మరో రెండేళ్లల్లో రానున్న గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం ఇప్పటి నుంచే రెడీ అవుతోంది. గత పుష్కరాలకు వచ్చిన భక్తులు, ఎదురైన ఇబ్బందులు, జరిగిన సంఘటనలను పరిగణలోకి తీసుకుని ఈసారి ముందస్తుగా అభివృద్ధి పనులకు సిద్ధమవుతోంది. పుష్కర ముహూర్తానికి రెండు నెలల ముందుగానే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అధికారంలోకి రాగానే మంత్రి నారాయణ రెండు పర్యాయాలు రాజమహేంద్రవరంలో అధికారులతో సమావేశమయ్యారు.ఇటీవల సీఎం చంద్రబాబు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే నరసాపురం ఎమ్మెల్యే నాయకర్ డివిజన్ స్థాయి అధికారులతో పుష్కరాలకు చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. అధికారులు గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. కొత్తగా ఏ పనులు చేపట్టాలన్న దానిపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు.

### గతంలో చాలా పనులు పెండింగ్

రాష్ట్ర విభజన తరువాత 2015లో జరిగిన పుష్కరాలకు ప్రభుత్వం దాదాపు రూ.1000 కోట్లు మంజూరు చేసింది. అత్యధికంగా రాజమండ్రి తరువాత నరసాపురానికే కేటాయించింది. అప్పటి ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు దాదాపు రూ.300 కోట్లు ప్రతిపాదనలు పెట్టారు. ఈ పనులకు నిధులు కూడా మంజూరు చేశారు.అయితే పనులు ముందస్తుగా చేపట్టకపోవడం వల్ల చాలా పనులు పూర్తికాలేదు. పుష్కర స్నానాలకు వచ్చిన భక్తులు కూడా నానా ఇబ్బందులు పడ్డారు. అంచనాల కంటే అత్యధిక సంఖ్యలో విచ్చేశారు. ఒక నరసాపురం ప్రాంతంలో 50 లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలు చేసినట్లు అంచనా. పుష్కరాల 12 రోజులు రోడ్లన్నీ జామ్ అయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చిన వాహనాలకు పార్కింగ్ కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడింది.దూర ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో వచ్చిన భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు సరైన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేకపోయారు. పెద్ద సంఖ్యలో లాడ్జీలు, ప్రభుత్వ విశ్రాంతి భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు.

### రహదార్లు.. రేవులపైనే ప్రధాన దృష్టి

ఈసారి పుష్కరాలకు ఎక్కువ మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేపడుతున్నారు. గతంలో పట్టణానికి రావాలంటే పాలకొల్లు రోడ్డు ఉండేది. 216 జాతీయ రహదారి అప్పట్లో అభివృద్ధికి నోచుకోలేదు. చినమామిడిపల్లి కాల్వ మీదుగా పాలకొల్లు వరకు రోడ్డును అభివృద్ధి చేసినా వచ్చిన ట్రాఫిక్‌కు ఈ మార్గం సరిపోలేదు. ఈసారి 216 మార్గం ఏర్పడినందున ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ ప్రాంత ప్రజలకు నరసాపురం దగ్గరవుతుంది. దీంతో ఈసారి ఎక్కువ మంది భక్తులు ఈమార్గం గుండానే వస్తారు. ప్రస్తుతం ఉన్న మొగల్తూరు, మచిలీపట్నం, బాపట్ల 216 జాతీయ రహదారికి పట్టణం నుంచే వెళ్లే ట్రాఫిక్ వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని కూడా పరిశీలిస్తున్నారు. దీంతో పాటు పాలకొల్లు , భీమవరం రహదార్లను కూడా విస్తరించాలని యోచిస్తున్నారు. టూరిజం సహకారంతో ఎక్కువ అతిథి గృహాలు ఏర్పాటు చేయాలని కసరత్తు చేస్తున్నారు. ఇవి కాకుండా పురపాలకం ఆధ్వర్యంలో గతంలో మాదిరిగానే రోడ్ల విస్తరణ, గోదావరి గట్టు, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో అదనపు రేవులు, దేవదాయ శాఖ, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఆలయాల ఆభివృద్ధి, సుందరీకరణ వంటి పనులు చేపట్టాలని యోచిస్తున్నారు.


నరసాపురం వలంధర్ రేవు

### ఎక్కువ నిధులు తెచ్చేందుకు ప్రయత్నాలు


ముందస్తుగా పనులు చేపడుతున్నందున ఈసారి పుష్కరాలకు అత్యధిక నిధులు తీసుకొచ్చి ఎక్కువ పనులు చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు. గత పుష్కరాలకు పురపాలక సంఘానికి దాదాపు రూ.100 కోట్లు ఇచ్చారు. అయితే పూర్తిగా పనులు చేపట్టలేదు. కొండాలమ్మ గుడి నుంచి స్మతివనం వరకు ఏటిగట్టు అభివృద్ధి చేశారు. అయితే ఈపనులన్నీ ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. రెయిలింగ్, గట్టు కూడా కుదించింది. ఈసారి గట్టు పటిష్ఠ పనులకు ఆధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏటిగట్టులశాఖ రూ.25 కోట్లతో సిద్ధాంతం నుంచి నరసాపురం వరకు 40 స్నానాల రేవుల్ని నిర్మించింది. ఈసారి ఈ సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. గత పుష్కరాలకు ట్రాన్స్‌కో రెండు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఈసారి మరో రెండు స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. నరసాపురం- భీమవరం మధ్య ఆర్ అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల్ని రూ.25కోట్ల పుష్కర నిధులతోనే చేపట్టింది. ఈసారి పాలకొల్లుకు ప్రత్యామ్నాయంగా చిన మామిడిపల్లి కాల్వ గట్టు రోడ్డును విస్తరించాలని యోచిస్తున్నారు.

### మండలాల్లోనూ అభివృద్ధి పనులు

యలమంచిలి, ఆచంట, పెనుగొండ, నరసాపురం మండలాల్లోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాలని యోచిస్తున్నారు. స్నానాల రేవులతో పాటు పరిసరాల్లోని ఆలయాల అభివృద్ధి, రేవులకు వచ్చే మార్గాలు విస్తరణ, శిథిలమైన గట్ల పటిష్ఠం, విద్యుత్, తాగునీరు, ఆర్అండ్‌బీ రహదార్లకు ప్రాధాన్యం కల్పించనున్నారు.

# చికెన్ అమ్మకాలకు కార్తీకం ఎఫెక్ట్

తణుకు, నవంబరు 6 : కార్తీక మాసం ఎఫెక్టు చికెన్ విక్రయాలపై పడింది. రోజువారీ అమ్మకాలకు భారీగా గండి పడింది. కార్తీక మాసం, మరో వైపు అయ్యప్ప దీక్షలు కారణంగా అమ్మకాలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు గ్రామాల్లో మాంసం అమ్మకాలు తగ్గుపోయాయి. ప్రతిరోజు 20 వేల కేజీల మాంసం అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం ఏడు నుంచి ఎనిమిది వేల కేజీల వరకే విక్రయిస్తున్నారు. అమ్మకాలు తగ్గినా ధరల్లో మాత్రం తగ్గలేదు. అమ్మకాలు లేకపోవడంతో వ్యాపారులు నిర్వహణ ఖర్చులు, ఇతర భారాలు ఎలా సరిపెట్టుకోవాలని వాపోతున్నారు.



ప్రస్తుతం మార్కెట్లో స్కిన్ లెస్ కిలో రూ. 240, స్కిన్‌తో రూ.220 కు విక్రయిస్తున్నారు.

### మాలధారణల ప్రభావమే..

కార్తీక మాసం వచ్చినపుడు ప్రతి సంవత్సరం భక్తులు మాలధారణలు వేసు కుంటారు. వాటిలో ఎక్కువగా అయ్యప్పస్వామి మాల ధారణలతో పాటు, శివస్వామి, ఆంజ నేయ స్వామి, సత్యనారాయణస్వామి, అమ్మవారి మాల ఎక్కువగా ధరిస్తుంటారు. వీటితో ఇంటో మహిళలు ప్రత్యేంగా పూజా కార్యక్రమాలతో ఉంటారు కాబట్టి చికెన్ వంటకాలు ఉండవు.

### అమ్మకాలు భాగా తగ్గాయి



కార్తీక మాసం కారణంగానే చికెన్ అమ్మకాలు బాగా తగ్గాయి. రోజువారీ ఖర్చులకు కూడా వచ్చే విధంగా అమ్మకాలు జరగడం లేదు. అమ్మకాలు లేకపోయినా ధరలు కూడా కంపెనీలు తగ్గించే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో షాపులు నిర్వాహణ, ఇతర ఖర్చులు భారం పడుతుంది.

**- చిలుకూరి సత్యనారాయణ, మయూరి చికెన్ సెంటర్ నిర్వాహకుడు**





అభయ లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, ఐజీ, ఎస్పీ తదితరులు

ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా పోలీసులు

# మహిళలకు రక్షణగా అభయ మహిళా సేఫ్టీ బృందాలు

» నేరాల నియంత్రణకు మహిళా సిబ్బంది పాటు పడాలి : ఐజీ

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో మహిళలకు అండగా పోలీస్ శాఖ మరో ముందుగు వేసింది. ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అభయ మహిళా సేఫ్టీ లోగోను ఆవిష్కరించి బృందాలను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాపశివకిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి బుధవారం ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. డీఐజీ మాట్లాడుతూ జిల్లాలో అభయ మహిళా సేఫ్టీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు ఎస్పీని అభినందించారు. పోలీసు వ్యవస్థలో 30 శాతం మహిళా పోలీస్ సిబ్బంది పని చేస్తున్నారని, భవిష్యత్తులో జరిగే రిక్రూట్‌మెంట్ లోను 30 శాతం మహిళలను నియమించనున్నట్టు ప్రకటించారు. మహిళా సేఫ్టీలో మహిళా పోలీసులు, గ్రామ మహిళల సంరక్షణ కార్యదర్శులు కాలేజీలు, హాస్టల్స్, బస్టాండ్‌ల వద్ద ఆకతాయిలు వేధింపులకు గురి చేసే ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు పాటుపడాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా మహిళలు, యువతులు, బాలికలను వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రత, సేఫ్టీ ఈ అభయ యాప్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన 95503 51100 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని లేదా టోల్‌ఫ్రీ నంబరు 112కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. జేసీ మాట్లాడుతూ ఈ అభయ యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యకరమంలో ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ రమణ, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు, కైకలూరు రూరల్ ఎస్ఐ రవికుమార్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, మహిళా ఎస్ఐ కాంతిప్రియ, మౌనిక, నాగకల్యాణి, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# మొండికోడులో ఉద్రిక్తం

» జనసేన నాయకులను అడ్డుకున్న స్థానికులు, టీడీపీ నాయకులు.. వారి మధ్య వాగ్వాదం



మొండికోడులో టీడీపీ, జనసేన నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

ఏలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం మొండికోడు గ్రామంలో చేపల చెరువు పట్టుబడి విషయంలో చెలరేగిన వివాదం చినికిచినికి గాలివానగా మారి ఉద్రిక్తం చోటుచేసుకుంది. ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు గ్రామంలో లీజుకు తీసుకున్న చేపల చెరువులో పట్టుబడి విషయంపై మంగళవారం రెవెన్యూ ఫారెస్ట్ అధికారులు అడ్డుకుని పట్టుబడి చేయనివ్వని సంగతి తెలిసిందే. సుమారు 22 ఎకరాల్లో ఉన్న చేపలు మృత్యువాత పడి రూ.40లక్షలు నష్టం వాటిల్లిందని ఎంపీపీ తెలిపారు. చనిపోయిన చేపలను పరిశీలించేందుకు బుధవారం జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, నాయకులతో కలిసి అక్కడకు చేరుకుని చెరువును పరిశీలించి తిరిగి వస్తుండగా స్థానికులు, పలువురు టీడీపీ నాయకులు జనసేన నాయకులను అడ్డగించారు. గ్రామ సమస్యను రాజకీయం చేయవద్దంటూ వారిని కదలనివ్వకుండా రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపివేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జనసేన నాయకులు మోరు నాగరాజు, టి.చందులను స్థానికులు నెట్టివేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేపలచెరువు పరిశీలనకు కవరేజ్ కోసం వెళ్ళిన మీడియాను సైతం స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అభిప్రాయ భేదాలు ఉంటే గ్రామపెద్దలతో పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలని, ఘర్షణకు దిగవద్దంటూ హెచ్చరించారు. పోలీసులు కౌన్సెలింగ్ అనంతరం వివాదం సర్దుమణిగింది. ఘంటసాల వెంకటలక్ష్మి మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా మొండికోడులో వివాదస్పద చెరువుల్లో చేపల సాగు జరుగుతుందని, నాలుగేళ్ళుగా లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకు వచ్చిందంటూ అధికారులను ప్రశ్నించారు. రూ.40లక్షలు నష్టం వాటిల్లిందని, పట్టుబడి పట్టకుంటే చేపల చనిపోతాయని అధికారులను బ్రతిమాలినా పట్టించుకోలేదని తమపై ఒత్తిడి ఉందంటూ ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు చెప్పారని ఆమె తెలిపారు.

# తుప్పు వాసన చిక్కీలు

» గడువు ముగిసిన ప్యాకెట్ల పంపిణీ
» తినకుండా వదిలేసిన విద్యార్థులు
» దీనిపై హెచ్‌ఎం నిర్లక్ష్య సమాధానం



ద్వారకాతిరుమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అందించిన చిక్కీలు తుప్పుకంపు వచ్చాయి. వాటిని విద్యార్థులు తినకుండా వదిలివేశారు. ఆ చిక్కీలను గమనిస్తే అవన్నీ గడువుతేదీ ముగిసినవే. ఈ ఏడాది ఆగస్టు 30వతేదీన తయారుకాగా తయారైన నాటి నుంచి రెండు నెలల్లోపు వాటిని వినియోగించాలని ప్యాకెట్‌పై ఉంది. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికుల దృష్టికి వెళ్లింది. వారంతా పాఠశాలకు వచ్చి హెచ్‌ఎం డి.తులసీవరలక్ష్మికి ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం వారికి సరైన సమాధానం చెప్పకుండా దురుసుగా ప్రవర్తించారని, 'మాకు ప్రభుత్వం అవే సరఫరా చేసిందని, విద్యార్థులకు అవే ఇచ్చామని' నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని స్థానికులు వాపోయారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

## 10న ఉచిత మెగా డీఎస్సీ ఎస్సీ, ఎస్టీ స్క్రీనింగ్ పరీక్ష

భీమవరం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక గిరిజన సంక్షేమశాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాడేపల్లి వారి ఉత్తర్వులు మేరకు ఉచిత మెగా డీఎస్సీ ఎస్సీ, ఎస్టీ స్క్రీనింగ్ పరీక్ష ఈనెల 10వ తేదీన ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు జరుపబడునని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులందరూ ఉదయం పది గంటలకు పరీక్ష కేంద్రంలో రిపోర్టు చేయాలన్నారు. 10:15 నిమిషాల తరువాత అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించమన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పరీక్ష కేంద్రాలు డీఎన్నార్ కాలేజీ భీమవరం, శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్, కరకట్ల, తాడేపల్లిగూడెం. పరీక్షకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ హాల్ టికెట్‌ను హెచ్‌టీటీపీ://జెఎన్‌ఏఎన్‌ఏబీయాఎమ్‌ఐ.ఏపీ.జీవో వి.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా జిల్లా షెడ్యూల్డు కులముల మరియు సాధికారిత అధికారి ఎం.శోభరాణి తెలిపారు. సంబంధిత అధికారులు స్క్రీనింగ్ పరీక్షకు సమయానికి హాజరు కావాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షకు ఆన్‌లైన్‌లో మాత్రమే నిర్వహించబడుతుందన్నారు.



# సోషల్ మీడియాలో రెచ్చిపోతే
# జైలుకే

భీమవరం క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రముఖులు, సెలబ్రిటీస్‌ను సోషల్ మీడియా వేదికగా అసభ్యపదజాలంతో దూషిస్తూ, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్న వారికి ఇబ్బందులు తప్పవు. రకరకాల పోస్టులు పెడుతూ హీరోలు అయిపోతాం అనుకున్న వారందరూ ఇటీవల జీరోలు అయిపోతున్నారు. ముఖ్యమంత్రి స్థాయి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, హీరోలు, నాయకులు ఇలా ప్రతివారిని దూషించడమే పనిగా పెట్టుకుని చివరకు జైలుకు వెళుతున్న పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు గత ప్రభుత్వ హయాంలో కొందరు తనను ఎక్స్ వేదికగా దూషించమన్నారు. అందుకే దూషించాను అంటూ పోలీసులకు పట్టుబడిన ఒక రౌడీషీటర్ చెప్పడం చూస్తుంటే ఎంత విడ్డూరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 4 కేసులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండేళ్ళలో నాలుగు కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధిపై దూషించిన కేసు, ఒక నియోజకవర్గ ప్రతినిధిని అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేసిన కేసు నమోదైంది. దీంతో పాటు భీమవరం, పాలకోడేరులలో ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లపై దుర్భాషలాడుతూ పోస్టులు పెట్టిన ఇద్దరు యువకులపై కేసు నమోదైంది. భీమవరం మారెళ్ళవారి వీధికి చెందిన బగ్గు జయరామ్, పాలకోడేరుకు చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజులపై కేసులు నమోదు చేశారు.



### సోషల్ మీడియా పోస్టులపై నిఘా

ఎవరైనా సోషల్ మీడియాను ఆనందించి ఆహ్లాదకరమైన, ఉపయోగకరమైన పోస్టులు పెట్టాలే తప్ప నాయకులను, అధికారులను, సినిమాలను కించపరిచేవిధంగా అసభ్య పదజాలంతో దూషించడం సరికాదు. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాంటి పోస్టులపై పోలీస్‌శాఖ పూర్తిస్థాయి నిఘా పెట్టింది. కొందరు వెనుక ఉండి అలాంటి పోస్టులు పెట్టించి తప్పుకుంటారు. దీంతో అమాయకులు బలైపోతున్నారు.

\- జి.కాళీచరణ్ టూటౌన్ సీఐ, భీమవరం



# జనసేన పార్టీకి భంగం కలిగేలా పోస్టులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన పార్టీ నాయకులు

జీలుగుమిల్లి, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీకి భంగం కల్గించేలా ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌లో 'పవన్‌ని పట్టించుకోని జనసేన ఎమ్మెల్యే' అనే అంశంపై సోషల్ మీడియాలో పోస్టులు వచ్చాయి. దీనిపై జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో జనసేన పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా వ్యాఖ్యానించిన చానల్ విషయమై విచారణ జరిపి, సంబంధిత వ్యక్తులు ప్రసార మాధ్యమాల ద్వారా జనసేన ఎమ్మెల్యేల ప్రతిష్టకు భంగం కల్గిస్తూ ట్రోల్ చేస్తున్న వారందరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. లేనిచో రాష్ట్ర, నియోజకవర్గ, మండల స్థాయిల్లో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము నాయకులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతామని ఎస్ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు.

# గ్రంధి నివాసంలో ఐటీ దాడులు

» భీమవరంలో కలకలం » స్థానిక పోలీసులకూ ఇవ్వని సమాచారం
» గోప్యత పాటించిన ఐటీ శాఖ » కేంద్ర పోలీస్ బృందాలతోనే తనిఖీలు
» గ్రంధి బినామీలుగా గుర్తించిన మరో నలుగురి ఇళ్లలోనూ సోదాలు

(భీమవరం/భీమవరం క్రైం-ఆంధ్రజ్యోతి) : భీమవరంలో ఆదాయపు పన్ను శాఖ దాడులు కలకలం రేపాయి. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో గ్రంధి నివాసానికి మూడు వాహనాల్లో ఐటీ బృందం చేరుకుంది. ఐటీ శాఖ అధికారుల తనిఖీలకు సాధారణంగా స్థానిక పోలీసులను భద్రత కోసం ఉపయోగిస్తారు. భీమవరంలో మాత్రం కేంద్ర పోలీస్ బృందాలను రప్పించారు. స్థానిక పోలీస్‌లకు సమాచారం లేదు. గ్రంధి నివాసంలో కీలకమైన రికార్డులు లభ్యమైనట్టు సమాచారం. ఇతర దేశాలకు ఎగుమతి చేసే రొయ్యల వ్యాపారంలో పెద్ద మొత్తంలోనే లావాదేవీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర తనిఖీ భద్రతా సిబ్బంది ఆధ్వర్యంలో ఐటీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏలూరు, కృష్ణా జిల్లా నాగాయలంక లోనూ గ్రంధి అనుయాయుల కార్యాలయా ల్లోనూ తనిఖీలు జరిగాయి. అధికారులు తనిఖీల సమయంలో మాజీ ఎమ్మెల్యే తన నివాసంలో లేరు. గ్రంధి కుమారు ని వద్ద అధికారులు వివరాలు సేకరించారు. సాయంత్రం ఆరు గంటల వరకు రికార్డులను పరిశీలించారు. స్వల్ప విరామం తర్వాత మళ్లీ తనిఖీలు ప్రారంభించారు.

### ఇది రెండోసారి

గ్రంధి నివాసంలో ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు నిర్వహించడం ఇది రెండోసారి. మూడు దశాబ్దాల క్రితం అంటే 1994లో ఒకసారి సోదాలు చేపట్టారు. తాజాగా మళ్లీ తనిఖీలు నిర్వహిస్తున్నారు. గ్రంధి శ్రీనివాస్‌తో బినామీలుగా భావించే సుంకర చిన్న, యర్రంశెట్టినాగేశ్వరరావు, ప్రసాద్, భగవాన్ అనే వ్యక్తుల నివాసాల్లోనూ తనిఖీలు చేపట్టారు.

### రాజకీయ ప్రాధాన్యం

గ్రంధి నివాసంలో ఐటీ దాడులు రాజకీయంగానూ చర్చకు దారితీశాయి. కొద్ది రోజుల క్రితం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్ నాగరాణికి గ్రంధిపై ఫిర్యాదు చేశారు. పేదల ఇళ్ల కోసం సేకరించిన భూమిని అధిక ధరలకు కొనుగోలు చేశారని, అవకతవకలకు పాల్పడ్డారంటూ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అంతలోనే గ్రంధి నివాసంలో ఐటి అధికారులు తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. రాత్రి పది గంటల అయినప్పటికీ తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నారు.

### వ్యాపారి నూకల రామకృష్ణ ఇంటిపై..

ఏలూరు క్రైం : ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నూకల రామకృష్ణ ఇంటి వద్ద తమిళనాడుకు చెందిన సెంట్రల్ ఐటీ అధికారుల బృందం బుధవారం ఉదయం 11 గంటలకు పత్తేబాదలో ఉన్న ఉండవల్లి అపార్టుమెంటు ప్రాంతానికి చేరుకుని తనిఖీలు చేపట్టింది. అధికారులు స్థానిక పోలీసుల సహకారం తీసుకోలేదు. వారు సెంట్రల్ ఇండ్రస్టియల్ సెక్యూర్టీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) జవాన్ల సహకారంతోనే తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎవరిని లోపలకు అనుమతించలేదు. ఈ తనిఖీల బృందానికి ఎస్పీ స్థాయి అధికారిణి నేతృత్వం వహిస్తున్నారు. వ్యాపారి రామకృష్ణ స్థానికంగా ఒక బ్యాంకును కూడా నిర్వహిస్తున్నారు. దెందులూరు సమీపంలోని నాగ హనుమాన్ ఆయిల్ ఫ్యాక్టరీ, రైస్‌మిల్లు, ఐస్ ఫ్యాక్టరీలతో పాటు పలు రకాల వ్యాపారాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వంట నూనె ధరలు పెరగడంతో వంట నూనె ఫ్యాక్టరీలను నిర్వహిస్తున్న అనేక మంది ఇళ్లను సెంట్రల్ ఇన్‌కమ్ టాక్స్ అధికారులు సోదాలు చేస్తున్నట్టు తెలుస్తుంది. దీనిలో భాగంగానే నగరంలోని వ్యాపారి రామకృష్ణ ఇంటిపై సోదాలు చేసినట్టు తెలుస్తోంది. ఆయన అందుబాటులో లేనప్పటికీ ఆయన కుమారుడు సమక్షంలో ఐటీ అధికా రులు వంట నూనెల ఫ్యాక్టరీలకు సంబంధించిన వివరాలను వాటి ఇన్‌కమ్ టాక్స్ వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్టు సమాచారం. బుధవారం రాత్రి కూడా సోదాలు కొనసాగు తూనే ఉన్నాయి. వివరాలు వెల్లడించడానికి అధికారులు నిరాకరించారు.



అపార్టుమెంటు వద్ద కాపలాగా వున్న సీఐఎస్ఎఫ్ జవాన్, కూర్చున్న ఐటీ అధికారులు

## క్రైమ్ కార్నర్


### పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

భీమవరం క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామం వినాయకపురానికి చెందిన కౌరు కోటేశ్వరరావు(64) కొంత కాలంగా బీపీ, పక్షవాతంతో బాధపడుతున్నాడు. బాధ భరించలేక మనస్తాపంతో ఈనెల మూడో తేదీన పురుగుల మందు తాగి ఇంటి సమీపంలోని పొలంలో పడి ఉన్నాడు. స్థానికులు చూసి బంధువులకు చెప్పడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### టైరు పేలి అదుపు తప్పిన మోటారు బైక్.. ఒకరి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు ముందు చక్రం టైరు పంచర్ కావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం నెల్లిపూడికి చెందిన చాకలి చిట్టిబాబు (40) బైక్‌పై తన గ్రామం నుంచి కరీంనగర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ దుగ్గిరాల బ్రిడ్జి దాటిన తరువాత ముందు చక్రం టైరు పంచర్ అయి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఐరన్ గార్డులను ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని ఏలూరు 108 అంబులెన్సు సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి బుధవారం సాయంత్రం తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చారు.

### వాహనం ఢీకొని ఒకరి మృతి



రామకృష్ణ (ఫైల్)

జీలుగుమిల్లి, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి దర్భగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన కొవ్వల రామకృష్ణ(55) మంగళవారం రాత్రి గ్రామంలో ఓ చోట జరిగిన కుల సంఘం సమావేశానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా హైవేపై నడిచి వెళుతున్న సమయంలో చీకట్లో జంగారెడ్డిగూ డెం వైపు నుంచి జీలుగుమిల్లి వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బాధితుడిని జంగారెడ్డి గూడెం ఆస్పత్రికి తరలించగా మృతి చెందిన ట్టు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారు డు నాగబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ రాధాకృష్ణ తెలిపారు.

# గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



రత్నకుమార్ (ఫైల్)

ఉండి/ఏలూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుల నాయకత్వ శిక్షణ తరగతులకు హాజరైన ఉండి మండలం ఉణుదుర్రు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తోట వెంకట రత్నకుమార్ (54) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో గల హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో ప్రభుత్వ స్కూళ్ల నాయకత్వ శిక్షణ కార్యక్రమం మూడు రోజుల నుంచి జరుగుతున్న సంగతి తెలిసిందే. ఉణుదుర్రులో మూడేళ్ల నుంచి రత్నకుమార్ లెక్కల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా కొనసాగుతున్నారు. ఆయన భార్య చంద్రకళ కూడా ఇదే పాఠశాలలో ఇంగ్లీషు టీచరుగా పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం గణపవరం మండలం కేశవరం, ఇద్దరు పిల్లల చదువు నిమిత్తం భీమవరంలో నివాసం వుంటున్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపీటీసీ అల్లూరి మాధవి తదితరులు స్వగ్రామానికి విచ్చేసి నివాళులర్పించి, సంతాపం తెలిపారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.

### ఉపాధ్యాయ సంఘాల ఆందోళన

హెచ్‌ఎం ఆకస్మిక మృతి ఘటనపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా స్పందించాయి. శిక్షణ తరగుతులు జిల్లాకు మారుమూల ప్రాంతమైన అగిరిపల్లిలో పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్‌కు బుధవారం పంపిన లేఖ నకళ్లను విలేకరులకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.అంజనేయులు విడుదల చేశారు. శిక్షణ కేంద్రంలో సరైన వైద్యసదుపాయం అందకపో వడం వల్లే హెచ్‌ఎం మరణించారని తెలిపారు. శిక్షణను మూడు రోజులకు కుదించాలని, అనారోగ్య సమస్యలున్న వారికి మినహాయింపు నివ్వాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ కోరారు. హెచ్‌ఎం మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏపీటీ ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు.


# ఇంట్లో నిద్రిస్తుండగా చోరీ

25 కాసుల బంగారం.. కిలో వెండి వస్తువుల అపహరణ

పెనుగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం శివారు నక్కావారిపాలెం ఓ ఇంటిలో చోరీ జరిగిన సంఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. సాధా నాగేశ్వరరావు, భార్య ఇంటిలోని ఓ గదిలో నిద్రిస్తుండగా వేరే గదిలో వున్న బీరువాలో బంగారం, వెండిని గుర్తుతెలియని దొంగలు దోచుకున్నట్టు తెలిపారు. 25.2 కాసుల బంగారం, కిలో వెండి వస్తువులు దోచుకున్నారని వెల్లడించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెనుగొండ ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు. నాగేశ్వరరావుకు ఇద్దరు కొడుకులు కాగా చిన్న కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తాడని, అక్కడ అద్దె ఇంటిలో ఉండడంతో ఆ బంగారం తమ దగ్గర పెట్టినట్లు చెప్పారు. ఈ విషయంపై అడిషనల్ ఎస్పీ మురళీ కృష్ణ, సీఐ రాయుడు విజయ్ కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### ఇసుక తరలింపుపై వివాదం

ట్రాక్టర్లను నిలిపిన రాజవరం వాసులు



గంగవరంలో నిలిచిన ఇసుక ట్రాక్టర్లు

కొయ్యలగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజవరం యర్రకాల్వ నుంచి ఇసుక తరలింపుపై వివాదం చోటు చేసుకుంది. గ్రామస్థులు బుధవారం ట్రాక్టర్లను నిలుపుదల చేశారు. ఇసుక తరలింపులో ఓ వ్యక్తి డబ్బులు చెల్లించాలని అడుగుతున్నాడని ట్రాక్టర్ డ్రైవర్లు ఆరోపించారు. ఉచిత ఇసుక విషయంలో డబ్బులు ఎందుకు చెల్లించాలంటూ డ్రైవర్లు ప్రశ్నించారు. దీనికి తోడు గ్రామస్థులు రోడ్ల వెంబడి నిత్యం వందలాది ట్రాక్టర్లు వెళ్ళడంతో రోడ్లు పాడవుతున్నాయని గ్రామస్థులు ట్రాక్టర్లు నిలుపుదల చేశారు. ఈ విషయం తహసీల్దార్ చెల్లన్నదొరకు చేరడంతో ఆయన సిబ్బందితో వెళ్ళి సమస్యను పరిష్కరించారు. సర్పంచ్‌తో మాట్లాడి దుమ్ములెగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మరో మార్గాన్ని కూడా ఆ రహదారిలో ట్రాక్టర్లు వెళ్ళేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

# కార్గో సేవల్లో జిల్లాలో తాడేపల్లిగూడెం టాప్

» జిల్లా మేనేజర్ దుర్గారావు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్గో సేవల్లో జిల్లాలోనే తాడేపల్లిగూడెం ప్రథమ స్థానంలో ఉందని కార్గో జిల్లా మేనేజర్ జీఎల్‌వీపీ దుర్గారావు తెలిపారు. తాడేపల్లిగూడెం డిపోను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 2024-25 సంవత్సరంలో తాడేపల్లిగూడెం రూ.1.32 కోట్లు బిజినెస్ జరిగిందని వివరించారు. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ డిపో మేనేజర్ ఏడీఎల్ సుధారాణి, డీఎంఈ కార్గో మాధవరావు సిబ్బంది పాల్గొన్నారు.

### బాలికను వేధిస్తున్న యువకులపై పోక్సో కేసు

ద్వారకాతిరుమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ బాలికను వేధిస్తున్న ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ సుధీర్ తెలిపారు. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక ప్రతీరోజూ స్కూల్ బస్సులో ఇంటి వద్ద నుంచి పాఠశాలకు వెళ్లి వస్తుండేది. ఇదే సమయంలో ప్రతీరోజూ తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గంజి ప్రేమ్‌కుమార్, మద్దిరాల పోసిబాబు బాలిక వెనుక పడి ప్రేమిస్తున్నానని వేధించడం ప్రారంభించారు. ఫోన్ ఇచ్చి తమతో మాట్లాడాలని ఒత్తిడి చేయడంతో భయపడిన బాలిక స్కూల్‌కు వెళ్లనని మొరాయించింది. తల్లిదండ్రులు వాకబు చేయగా విషయం తెలిసి.. ఆ ఇద్దరు యువకులను నిలదీయగా ఎవరూ ఏమీ చేయలేరని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై విచారించి ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### ఏడుకు చేరిన బాణసంచా మృతుల సంఖ్య

చికిత్స పొందుతూ మరొకరి మృతి

పెంటపాడు/ఉంగ్రాజవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఉంగ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో గత నెల 30వ తేదీన బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన దుర్ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. బుధవారం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింటు(43) ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతితో ఈ ప్రమాదంలో గాయపడిన వారంతా మృతి చెందినట్టు అయింది. పెద్దింట్లుకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోజు కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలో విషాదం అలుముకున్నది.

### మొగల్తూరులో క్షుద్రపూజల కలకలం !

మొగల్తూరు, నవంబరు6. (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. మొగల్తూరు పంచాయతీ పరిధి ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పడమటిపాలెం గ్రామాలకు ప్రధాన కూడలి ప్రధాన రోడ్డుపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసి రోడ్డుపై మూడు నిమ్మకాయలు, కోడిగుడ్డు, మసి బొగ్గు, కుంకుమ, పసుపు, అన్నం ముద్దలు, ఎండిమిర్చి తదితర సామగ్రిని రోడ్డుపై వదిలివేశారు. బుధవారం ఉదయం స్కూల్‌కి వెళ్లే చిన్నారులు, మార్కెట్‌కు వెళ్ళే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మొగల్తూరు హైవేపై గతంలోనూ క్షుద్ర పూజలు చేసిన దుండగలు, కొంతకాలం తరువాత మళ్ళీ పూజలు చేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవ్వుతున్నారు.



ప్రధాన రహదారిపై ఉంచిన వస్తువులు



సీఎం చంద్రబాబును కలిసిన దుర్గాప్రసాద్

## నామినేటెడ్ పదవుల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఏలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యం ఇవ్వాలని బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దురాప్రసాద్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బ్రాహ్మణుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. గత వైసీపీ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి పూర్వ వైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని సత్యవాడ దుర్గాప్రసాద్ తెలిపారు.

## రైల్వే సమస్యలపై ఎంపీ వినతి

భీమడోలు, నవంబరు 06 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైల్వే శాఖ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ చైర్మన్ సతీష్‌కుమార్‌కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వినతిపత్రాన్ని అందజేశారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఆయనను కలిసి జిల్లాలో రైల్వేశాఖ పరిధిలో ప్రజల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. భీమడోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్ ఏర్పాటు చేయాలన్నారు.

## జనవరిలో టీసీసీ పరీక్షలు

ఏలూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్లూమ్, వీవింగ్ లోయర్, హయ్యర్‌గ్రేడ్ పరీక్షలు జనవరిలో జరుగుతాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం తెలిపారు. ఈ నెల 30లోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. అపరాధ రుసుముతో డిసెంబరు 13వరకు చెల్లించవచ్చన్నారు.

## డీఎల్ఎడ్ పరీక్షలు ప్రశాంతం

డీఎల్ఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షకు 47 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ప్రథమసంవత్సరం సప్లిమెంటరీ పరీక్షకు 11మంది దరఖాస్తుచేసుకోగా ఐదుగురు హాజరయ్యారని వివరించారు.

## సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లైఫ్‌సేవింగ్ స్కిల్స్‌లో భాగంగా సీఆర్ఆర్ కళాశాల పీజీ విద్యార్థులకు కార్డియోపల్మనరీ రెస్యూసైటేషన్ (సీపీఆర్) ప్రక్రియపై బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణసంస్థ ప్రథమచికిత్స విభాగం ట్రైనర్ చిన్ని సత్యనారాయణ, వైద్యుల బృందం సీపీఆర్ ప్రక్రియను డెమో ద్వారా ప్రదర్శించారు. డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, డాక్టర్ వరప్రసాదరావును సత్కరించారు. సైకలాజిస్టు ఎ.రాంబాబు, డైరెక్టర్ యలమర్తి బాబు, ప్రిన్సిపాల్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లకు హెపటైటిస్ వ్యాక్సిన్

ఏలూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రి ఏఆర్‌టీ కేంద్రంలో ట్రాన్స్‌జెండర్లకు హెపటైటిస్-బి, సి పరీక్షలు నిర్వహించి, వ్యాక్సిన్ వేసినట్టు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. హెపటైటిస్ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించి, ప్రభుత్వం అందించే వైద్యసేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఏపీ సాక్స్ డీపీఎం పి.బాలాజీ, సూపర్‌వైజర్ హరనాథరావు, ప్రాజెక్టు మేనేజర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మధ్య ఘర్షణ

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఆర్ పేటలో రెండు కార్పొరేట్ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు ఘర్షణ పడ్డారు. కళాశాల బస్సు బుధవారం సాయంత్రం చింతలపూడి రోడ్డులో వెళుతుండగా మరో కళాశాలకు చెందిన విద్యార్థులు అడ్డగించి ఇద్దరు విద్యార్థులపై దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు కొంత మంది విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గతంలో కూడా ఈ కళాశాల విద్యార్థులు దాడులకు తెగబడ్డారు.

## ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. జాలిపూడిలో బెల్టు షాపు నిర్వహిస్తున్న మరడాని రాజారావును అరెస్టుచేసి 144 మద్యం సీసాలు, కలకుర్రు గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేసి 20 మద్యం సీసాలు, పెదవేగి మండలం రాట్నాలకుంటలో మరొకరిని అరెస్టు చేసి 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జీఎస్‌కె ధనరాజ్ తెలిపారు.

## తల్లి, కుమారుడు, కుమార్తె అదృశ్యం

ఉంగుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు గ్రామానికి చెందిన మహిళ, ఆమె కుమారుడు, కుమార్తె అదృశ్యమయ్యారు. మహిళ భర్త సాగు రామ్‌శేఖర్ చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసారు. అద్దె ఇంట్లో నివసిస్తున్నామని, ఈ నెల 2న మధ్యాహ్నం తన భార్య పిల్లలు అదృశ్యమయ్యారని, పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అద్దె ఇంటి వద్ద ఇద్దరిపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## బెల్ట్ షాపుపై పోలీసుల దాడి

ఉంగుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు శివారులో బుధవారం నాడు చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ దాడి చేసారు. మానేపల్లి సత్యనారాయణ వద్ద 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# లాభాల పంట బొప్పాయి



మెట్ట ప్రాంతంలో విస్తరిస్తున్న సాగు

### మూడేళ్లుగా సాగు చేస్తున్నా..



మూడేళ్లుగా ఎకరంన్నర భూమిలో బొప్పాయి సాగుచేస్తున్నాను. కర్నాటక నుంచి పంద్రా 15 రకం మొక్కలను తెచ్చి నాటాను. ఈరకం విత్తనానికి తెగుళ్ల తాకిడి తక్కువ కావడంతో పురుగుమందుల ఖర్చు తగ్గింది. ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి అవసరం. రూ.1.5 ఆదాయం వస్తే రూ. లక్ష మిగులుతుంది.

**కఠారి నాగరాజు, రైతు, మఠంగూడెం**

లింగపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి పెడుతున్నారు. మండలంలో పలువురు రైతులు బొప్పాయి సాగు లాభదాయకం అంటున్నారు. బొప్పాయి తక్కువ నీటితో పంట చేతికందడం కలిసొచ్చే అంశం. మొక్క నాటే సమయంలోనే మల్చింగ్ షీట్స్ వాడకం ద్వారా కలుపు నివారిస్తున్నారు. దీనితో ఎరువుల ఖర్చు కూడా కలిసి వస్తోంది. కర్నాటక నుంచి మొక్కలు తీసుకువచ్చి సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడితో రూ.1.5 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. తెగుళ్ల సమస్య స్వల్పం కావడంతో నివారణ చర్యలతో అధిగమించవచ్చని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

### తెగుళ్లను ప్రారంభంలోనే గుర్తించాలి



బొప్పాయి పంటకు తెగుళ్లు ఆశిస్తే ఆకులు రాలిపోయి పూత, పిందె నేలరాలతాయి. తెగుళ్లను ప్రారంభదశలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. నేల స్వభావాన్ని బట్టి దిగుబడి వస్తుంది. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తుంది. బొప్పాయి, అరటి, జామ, మునగ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

**షాఫియా ఫర్వీన్, ఉద్యాన శాఖాధికారి**

## భీమడోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ స్థలం పరిశీలన



రైల్వే స్టేషన్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

భీమడోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే గేటు సమీపంలో నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థలం, సర్వేపై ఆర్డీవో అచ్యుత అంబరీష్ బుధవారం పరిశీలించారు. రైల్వే బ్రిడ్జి స్థల సేకరణ కోసం పరిసర ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. స్థల సేకరణ అనంతరం రైల్వే ఓవర్ బ్రిడ్జి, లేక అండర్ బ్రిడ్జి అనేది రైల్వే శాఖ నిర్ణ యిస్తుందన్నారు. స్థల సేకరణ, సర్వే నిర్వహించి రైల్వే శాఖ అధికారులకు సంబంధిత వివరాలను అందజేస్తామన్నారు. తహసీల్దార్ రమాదేవి, భీమడోలు సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాతూరులో రేషన్ సరుకుల గోడౌన్‌ను ఆర్డీవో అచ్యుత అంబరీష్ బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బియ్యం నిల్వలు పరిశీలించారు.

● ఉంగుటూరు: కైకరంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్లాన్‌ను ఆర్డీవో అచ్యుత అంబరీష్ పరిశీలించారు. ఫ్లైఓవర్ పాయింట్‌ను పరిశీలించారు. తహసీల్దార్ వై.పూర్ణచంద్ర ప్రసాద్ ఉన్నారు.

## ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



వినతిపత్రం అందచేస్తున్న రైతుసంఘ నాయకులు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం మొత్తాన్ని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్ కోరారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వి.లక్ష్మికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలో 5.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా కాగా 3.4 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా ప్రకటించారన్నారు. రైతులు పండించిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు లక్ష్యంగా ప్రకటించడం వలన మిగిలిన పంటను దళారులకు, వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘ నాయకులు జగదీష్, దావీదు తదితరులు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి



ప్రత్యేక డీఎస్సీ డిమాండ్ చేస్తున్న ఆదివాసీ నాయకులు

బుట్టాయగూడెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామని చంద్రబాబు అరకు ఎన్నికల సభలో ఆదివాసీలకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఆదివాసీ నిరుద్యోగుల సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కారం భాస్కర్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. నాయకులు మా ట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ఆదివాసీలకు నిరాశే మిగిలిం దన్నారు. మెగా డీఎస్సీతోపాటు ఆది వాసీ ప్రత్యేక డీఎస్సీకి పునఃపరిశీలన చేయాలన్నారు. జీవో నెంబరు 3ను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు ధర్ముల రమేష్, కారం రాఘవ, పోలోజు నాగేశ్వరావు, ఎస్.రామ్మోహన్, కుంజా నవీన్, కె.పృధ్విరాజు, ఈ.భూషణం, టి.బాబూరావు, కె.నాగేశ్వరావు, కె.కిరణ్, ఎస్.మహర్షి, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టులు : పోలీసులకు ఫిర్యాదు



కుక్కునూరులో ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

కుక్కునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఎమ్మెల్యేలపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎం.యుగంధర్, మం త్రి గోపాలకృష్ణ, లక్ష్మణస్వామి, నాగరాజు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలవరం: జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గునపర్తి వీరవెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం నాయకులు, కార్యకర్తలు కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ పవన్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. టి.రాంప్రసాద్ ఇతర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ, జనసేన ముఖ్య నాయకులతో మంత్రి సమావేశం

జంగారెడ్డిగూడెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తమకు తగిన గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటినుంచి నియోజకవర్గంలో జరిగే ఏ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొనడం లేదు. జనసేన పార్టీకి చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో మంత్రి పార్థసారధి జనసేన, టీడీపీ నాయకులకు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిష్టానం నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచించినట్లు తెలిసింది. కూటమి నాయకులంతా కలిసి చర్చించుకోవాలని హితవు పలికారు. మంత్రి సూచనలతో టీడీపీ, జనసేన నాయకులంతా సానుకూలంగా తీసుకున్నట్లు తెలిసింది. ఇరు పార్టీ నాయకుల మధ్య మంత్రి పార్థసారధి సఖ్యత కుదర్చడంతో అనిశ్చితి తొలగినట్లయింది. ఇక నుండి నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిసింది.

## అసాంఘిక శక్తులపై నిఘా పెంచాలి : ఎస్పీ కిశోర్



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు అసాంఘిక శక్తులపై నిఘా పెంచాలని ఎస్పీ కిశోర్ సూచించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. జూదం, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సమాచారాన్ని వెంటనే పోలీస్ స్టేషన్‌కు అందించాలన్నారు. ఆకతాయిలపై చర్యలు తీసుకోవడానికి పోలీసులకు అప్పగించాలన్నారు. భవిష్యత్‌లో నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు సహకారం అందించాలని సూచించారు. ఎవరైనా మహిళలు, చిన్నారులు, యువతులపై వేధింపులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఎస్పీతోపాటు ఏఎస్పీ ఎన్ సూర్య చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు సిబ్బంది వేతన బకాయిలు చెల్లించాలి



చింతలపూడిలో ధర్నా చేస్తున్న వీవోఏలు

చింతలపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలు చెల్లించాలంటూ వెలుగు కార్యాలయం వద్ద వీవోఏలు బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు ఆర్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ వీవోఏలకు నాలుగు నెలల వేతన బకాయి చెల్లించాలన్నారు. వీఓఏల నాయకురాలు ఆమని మాట్లాడుతూ తమ సమస్యల పరి ష్కారం కోరుతూ మూడు రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ధర్నాలో ఆశ, భానుమతి, కృష్ణకుమారి, వసంత, ఈశ్వర మ్మ, రాణి పాల్గొన్నారు.

**మెప్మా ఉద్యోగుల ఆందోళన**

చింతలపూడి పట్టణ మెప్మా రీసోర్స్‌పర్సన్స్ తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక అధికారి రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. మూడు నెలల వేతన బకాయిలు విడుదల చేయాలని, ఉద్యోగ కాల పరిమితిని ఎత్తివేయాలని, ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందచేసినట్టు ఇ.ఝాన్సీ, బి.కృష్ణవేణి తెలిపారు. జశ్వంత, మహాలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు, మండల వీవోఏలు కలిసి జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఐదు నెలలుగా పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెలుగు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరావు, వెలువలమ్మ, రత్నకుమారి, టి.దుర్గ, భవాని, వీరలక్ష్మి, నాగఝాన్సీ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు సాగులో యాంత్రీకరణ అవసరం



నాట్లు వేస్తున్న యంత్రం వద్ద సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు

జీలుగుమిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగులో యాంత్రీకరణ రైతులకు ప్రయోజనమని మాగంటి శేషుమాధవ్ అన్నారు. జీలుగుమిల్లి సీటీఆర్ఐ (కేంద్రం పొగాకు పరిశోధన సంస్థ) వద్ద భోపాల్‌లో రూపొందించిన పొగాకు మొక్కలు నాటే యంత్రం పనితీరు బుధవారం పరిశీలించారు. దీంతో కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. ట్రేలో పెంచిన నారు పరిశీలించి వీటిని నాటడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుందన్నారు. పొగాకు బ్యారన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాజశేఖర్, వైవి.సుబ్బయ్య, శాస్త్రవేతలు టి.కిరణ్‌కుమార్, ఎం.వెంకటేశ్, ఫాం మేనేజర్ టి.వెంకటేష్, టి.రమేష్, వై.వెంకటేశ్వరరావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

**పొగాకు ప్రత్యామ్నయం ఎంచుకోవాలి**

కొయ్యలగూడెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు పంట బదులు ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ బుజ్జిబాబు సూచించారు. మండలంలోని కన్నాపురం, దిప్పకాయలపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అధికారుల సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏవో కోటగిరి మురళీకృష్ణ సూచించారు. కొత్తపల్లి, మఠంగూడెం గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పచ్చిమిర్చి, పత్తి పంటలను పరిశీలించారు. పురుగుమందులు, రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నాగకుమార్, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం.. చిన వెంకన్న తిరువీధి సేవ

ద్వారకాతిరుమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తొళక్కువాహనంపై ఉభయ నాంచారులతో కొలువుతీరిన చిన్న తిరుమలేశుడు బుధవారం రాత్రి క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. ఆళ్వార్ తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ సేవ భక్తజనులకు నేత్రపర్వమైంది.

తిరుమలంపాలెం భ్రమరాంబ సమేత ఆది మల్లేశ్వరస్వామికి బుధవారం లక్షబిల్వార్చన నిర్వహించారు.

**వరసిద్ధి వినాయకుడికి పూజలు**

కామవరపుకోట: స్థానిక వరసిద్ధి వినాయక ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, సత్య శ్రీనివాసాచార్యులు పూజలు జరిపించారు.

**అయ్యప్ప భక్తులకు భిక్ష**

దెందులూరు: అయ్యప్ప భక్తులకు గాలాయగూడెం అచ్చమ్మ పేరంటల ఆలయ అవరణలో భిక్ష ఏర్పాటు చేశారు. గంటా కోటేశ్వరావు అచ్చమ్మ దంపతులు 800 మంది అయ్యప్ప భక్తులకు అల్పాహారం అందించారు.

**ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు**

ఉంగుటూరు: కైకరం శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ హుండీ ఆదాయం తహసీల్దార్ వై.పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.7,21,690 ఆదాయం వచ్చింది. వచ్చాయి. సిబ్బందికి 11నెలల జీతాల సొమ్ము మినహాయించి రూ.5,96,440 నగదు బ్యాంక్ ఖాతాలో జమచేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ వై.పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు.

**వారాహి దేవి విగ్రహ ప్రతిష్ఠ**

పోలవరం: కొత్తరామయ్యపేటలో బుధవారం వారాహీ దేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## మహిళా వైద్య సిబ్బంది రక్షణకు చర్యలు తీసుకోవాలి



ఆసుపత్రి సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏఆర్ డీఎస్పీ శ్రీహరి

ఏలూరు టూటౌన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్లు, సిబ్బంది రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏఆర్ డీఎస్పీ వీజీ.శ్రీహరి అన్నారు. ఆసుపత్రిలో మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికుల రక్షణ పరిశీలనకై ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు బుధవారం ఆశ్రం ఆసుపత్రిలో భద్రతా చర్యలు పరిశీలించారు. ఆసుపత్రిలో సీసీ.కెమెరాలు, మహిళా వార్డులు, మహిళా డాక్టర్లు, సిబ్బంది విశ్రాంతి పొందే కారిడార్‌లలో నిఘా కెమెరాలు పరిశీలించారు. అనంతరం డీఎస్పీ శ్రీహరి మాట్లాడుతూ మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆసుపత్రి యాజమాన్యంపై ఉందన్నారు. రాత్రి సమయాల్లో ఆసుపత్రికి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మద్యం, మత్తుపదార్థాలు సేవించే వారిని ఆసుపత్రిలోకి అనుమతించరాదన్నారు. కార్యక్రమంలో సీఈవో హనుమంతరావు, సూపరింటెండెంట్ కాంతయ్య, వీఆర్వో సీహెచ్.దుర్గాప్రసాద్, వైద్యులు పద్మజ రాణి, వీ.శారద, షేక్ హఫీజా పాల్గొన్నారు.

**వాహనదారులు నిబంధనలు పాటించాలి**

లింగపాలెం: వాహనదారులు సీట్‌బెల్ట్, హెల్మెట్, తప్పనిసరిగా ధరించాలని, నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ వెంకన్న సూచించారు. ధర్మాజీగూడెంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

**విద్యార్థులు క్రీడల్లో రాణించాలి**

పెదపాడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. సెయింట్ ఆగస్టీన్ హైస్కూల్‌లో 33వ స్పోర్ట్స్‌మీట్‌ను బుధవారం నిర్వహించారు. ఎస్సై కట్టా శారద సతీష్‌తో కలిసి సీఐ వెంకటేశ్వరరావు ఒలింపిక్ జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జెసింత, తదితరులు పాల్గొన్నారు.




బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్

## కొత్త బస్టాండ్‌లో క్రాడిల్ బేబి రిసెప్షన్ సెంటర్

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ నందు క్రాడిల్ రిసెప్షన్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్ పునరుద్ధరించారు. ఈనెల 7న గర్భస్థ శిశు దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా క్రాడిల్ రిసెప్షన్ సెంటర్, చంటి బిడ్డల తల్లుల పాలిచ్చే గదులను సందర్శించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా వద్దు అనుకున్న బిడ్డలను ఇటువంటి ఉయ్యాలలో విడిచిపెట్టాలన్నారు. బిడ్డల రక్షణను అధికారులు తీసుకుంటారని తెలిపారు. పి.పద్మావతి, సూర్యచక్రవేణి పాల్గొన్నారు.



సభ్యత్వం స్వీకరిస్తున్న తపనా చౌదరి

## బీజేపీ క్రియాశీలక సభ్యత్వం స్వీకరించిన గారపాటి చౌదరి

ఏలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఎం.బుజ్జి గోపాల్ నుంచి పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని అందుకున్నారు. సభ్యత్వ నమోదు వేగంగా సాగుతోందని జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిశోర్ అన్నారు. నిర్మలాకిశోర్, కృష్ణప్రసాద్, కె.కృష్ణ, ఎం.సత్యనారాయణ, అడపా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో టీడీపీ నేతలు

## మాగంటి బాబును పరామర్శించిన టీడీపీ నాయకులు

చింతలపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆస్పత్రిలో మాజీ మంత్రి మాగంటి బాబును చింతలపూడి టీడీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఇటీవల ఆయనకు శస్త్ర చికిత్స జరిగింది. కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, మద్దిపోటి నాగేశ్వరరావు, నెక్కలపు సూర్యనారాయణ, కోటగిరి వేణు, బొబ్బిలి దివాకర్, కోనేరు వెంకట్రామయ్య, ఏలూరు హరిబాబు, నెక్కలపు గంగాధర్, ఎం.నాగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, గుత్తా లోకేశ్ ఉన్నారు.

## రేపు కాంగ్రెస్ మహా ధర్నా

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్‌పేట విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద ఈనెల 8న మహా ధర్నా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు బుధవారం తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ విధానాలకు నిరసన, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఉద్యమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలన్నారు.

## 26న సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 100వ వ్యవస్థాపక దినోత్సవం ఈనెల 26న జరుగుతుందని, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు జెండా ఆవిష్కరణలు, ప్రచారం చేయాలని సీపీఐ జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్ఫూర్తి భవన్‌లో జిల్లా సమితి సమావేశం ఎండి.మున్నీర్ అధ్యక్షతన జరిగింది. వనజ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహించిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర సమితి సభ్యులు చెలసాని వెంకట్రామారావు మాట్లాడారు. మన్నవ కృష్ణ చైతన్య, బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమశంకర్, కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబు, బాడిస రాము, తదితరులు పాల్గొన్నారు.

## 'గ్యాస్' బదిలీకి దరఖాస్తు చేసుకోండి

కుక్కునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్యాస్ కనెక్షన్ ఉండి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మండల వినియోగదారులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వం ఉచిత గ్యాస్ ఇస్తున్న తరుణంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన దాదాపు 3వేల మందికి అందని పరిస్థితి నెలకొంది. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. గ్యాస్ కనెక్షన్ బదిలీ జరుగుతుందని, ఇబ్బందులు పడకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## 15 లీటర్ల సారా స్వాధీనం

చింతలపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాఘవాపురంలో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి ఇంజుమూడి వెంకటరమణ నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. పొనుకుమాడులో జి.అఖిల్‌కుమార్‌ను చింతలపూడి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

# క్యాన్సర్‌ను జయిద్దాం..

**గోదావరిజిల్లాల్లో బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ కేసులే ఎక్కువ**

**నాలుగింట మూడొంతులు మహిళలే**

**వయసుతో నిమిత్తం లేకుండా వ్యాధి**

**మారిన జీవనశైలి ప్రధాన కారణం**



ఏలూరు అర్బన్/ పాలకొల్లు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌కు దారితీసే 70 శాతం కారకాలు నివారించ దగ్గవిగా తేలినప్పటికీ తొలిదశలో గుర్తించలేకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదాలు ఉన్నాయి. ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా వ్యాధిని నయం చేసే అవకాశాలు ఉన్నాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఒకప్పుడు 40 ఏళ్ల పైబడిన వారిలో కనబడే క్యాన్సర్ ఇపుడు పిల్లల్లోను విస్తరిస్తోందని చెబుతున్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, పౌష్టికాహారం, మానసిక ప్రశాంతత ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండ వచ్చునని, అదే సమయంలో క్యాన్సర్ సోకినవారు భయపడాల్సిన పరిస్థితులు లేవని ఆధునిక చికిత్సా విధానాలతో వారి జీవితకాలాన్ని పొడిగించవచ్చునని భరోసా ఇస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలో లెక్కలివీ..

క్యాన్సర్ బాధితులకు అందుతున్న వైద్యసేవలు, వారి పరిస్థితులు తదితర అంశాలను పర్య వేక్షించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఇంతవరకు ప్రత్యేక యంత్రాంగమంటూ ఏదీ లేదు. అయితే గతేడాది వరకు వైద్య ఆరోగ్యశాఖ వద్ద నమోదైన క్యాన్సర్ రోగులసంఖ్య 2981 . వీరిలో 2264 మంది మహిళలు కాగా, 717 మంది పురుషులు. ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ చికిత్సల కోసం ప్రత్యేకంగా ఏలూరు శివారు వంగాయగూడెంలో 16 ఏళ్లక్రితం ప్రారంభించిన గుడ్ సమరిటన్ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు 19,750 మంది మహిళలు, పురుషులు రిజిస్టర్ అయివున్నారు. ఇక్కడి ఆస్పత్రికి అవుట్ పేషెంట్లుగా రోజుకి మూడు విభాగాల్లో 140 మంది వైద్యం పొందుతుండగా, ఇన్‌పేషెంట్లుగా దీనికి మరో నాలుగైదు రెట్లు చికిత్సలు తీసుకుంటున్నారు. పొరుగు జిల్లాల నుంచి కూడా చికిత్స కోసం ఇక్కడికి వస్తున్నారు.

### గోదావరి జిల్లాల్లో క్యాన్సర్ దారులిలా...

ఉభయగోదావరి జిల్లాల్లో కొన్ని రకాల క్యాన్సర్ వ్యాధి వేగంగా విస్తరిస్తోన్నట్టు అంకాలజిస్టులు చెబుతున్నారు. ఇక్కడి గ్రామీణ ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి స్థిరపడిన పేద కుటుంబాల్లో మహిళలు పొగాకు ఉత్పత్తులను రివర్స్ పద్ధతిన నోటిలో పెట్టుకుని పొగను గొంతుగుండా లోపలికి తీసుకుంటుండటం వల్ల వాటిలోని విషపూరిత రసాయనాల ప్రభావం కారణంగా నోటి క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్‌లకు గురవుతున్నట్టు తమ పరిశీలనలో గమనిస్తున్నామని వైద్యనిపుణులు వివరించారు. దూమ పానంలో రివర్స్ స్మోకింగ్ అత్యంత ప్రమాదకరమని, ఈ ప్రక్రియలో బయటకు వదలాల్సిన పొగ నేరుగా శరీరంలోకి, తద్వారా రక్తం, ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి అత్యంత వేగంగా క్యాన్సర్‌కు గురిచేస్తుందన్నారు. దీంతో పాటు గుట్కా వంటి నోటితో నమిలే పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా యువతలో నోటిక్యాన్సర్‌కు దారితీస్తోందని హెచ్చరిస్తున్నారు. ఇక మద్యపానం సేవనం మోతాదుకు మించి గోదావరి జిల్లాల్లో అన్నివర్గాల్లో ఉంటుండటం అన్నవాహిక క్యాన్సర్‌కు ప్రధాన కారణంగా వైద్య వర్గాలు విశ్లేషించాయి. పది అంగుళాల పొడవు, కండరాలతో కూడిన అన్నవాహిక క్యాన్సర్‌కు గురైతే ఊపిరితిత్తులు, కాలేయం, కడుపు, ఇతర శరీర భాగాలకు కూడా వ్యాప్తి చెందటం సహజంగానే జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో వేగంగా విస్తరిస్తోన్న క్యాన్సర్ రకాల్లో ఇది రెండో స్థానంలో ఉందని అంకాలజిస్టులు చెబు తున్నారు. గోదావరి జిల్లాల మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ లక్షణాలతో కూడిన కేసులు ఎక్కువవు తున్నాయి. దూమపానంతో పాటు, బలహీనమైన రోగనిరోదక శక్తి, లైంగిక వ్యాధులు, ఏళ్ళ తరబడి గర్భనిరోధక మాత్రలు వినియోగం, జీవిత భాగ స్వామితో కాకుండా అపరిచితులతో లైంగిక సంబంధాలు వంటివన్నీ గర్భాశయ క్యాన్సర్‌కు దారితీస్తాయి. 40 సంవత్సరాల వయసు దాటిన మహిళలు క్యాన్సర్ బారిన పడు తున్నట్టు వైద్యుల పరిశీలనలో తేలింది. గోదావరిజిల్లాలో ఈ మూడు రకాల క్యాన్సర్ వ్యాదుల వ్యాప్తి ఎక్కు వగా ఉన్నట్టు వైద్యనిపుణులు వివరించారు. కొంతకాలం క్రితం వరకు క్యాన్సర్ 40 ఏళ్ళ పైబడిన వయస్కుల్లోనే ఎక్కువగా వ్యాప్తి చెందు తున్నట్టు తాము గమనించామని, దీనికి బిన్నంగా ఇటీవలి కాలంలో చిన్నవయసులో బాలికలు కూడా క్యాన్సర్ బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు.

### ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే

ఆందోళనకర స్థాయికి విస్తరిస్తోన్న క్యాన్సర్‌ను నివారించడం లేదా నియంత్రించడానికి తగిన చర్యలు చేపట్టేందుకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి సర్వేను చేపట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలో కొద్దిరోజుల వ్యవధిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారి నేతృత్వంలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్‌తో కూడిన బృందాలను ఏర్పాటు చేసి అన్ని గ్రామీణ, పట్టణప్రాంతాల్లో ఇంటింటి సర్వేను చేపట్టను న్నారు. దీనికోసం ఇప్పటికే 140 మంది వైద్యాధి కారులు, 463 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 751 మంది ఏఎన్ఎంలు, 1700 మంది ఆశావర్కర్లకు బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ల స్క్రీనింగ్‌పై శిక్షణ నిచ్చారు. ఈ బృందాలు ఇంటింటికీ వెళ్ళి క్యాన్సర్ అనుమానిత లక్షణాలున్నవారిని గుర్తించి స్థానిక పీహెచ్‌సీకి రిఫర్ చేస్తాయి. సంబంధిత మెడికల్ ఆఫీసర్ పరిశీలనలో నిర్ధారణ అయితే, తదుపరి ఆ కేసును ఏరియా హాస్పిటల్ లేదా జిల్లా సర్వజన ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తారు. ఈ సర్వేవల్ల జిల్లాలో క్యాన్సర్ బాధితుల సంఖ్య, ప్రస్తుత పరిస్థితి వంటి సమగ్ర సమాచారం లభిస్తుందని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు తెలిపాయి. జిల్లాలో వారం రోజుల వ్యవధిలో ఈ సర్వేను క్షేత్రస్థాయిలో ప్రారంభించనున్నారు.

# గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

ఉండి/ఏలూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుల నాయకత్వ శిక్షణ తరగతులకు హాజరైన ఉండి మండలం ఉణుదుర్రు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తోట వెంకట రత్నకుమార్ (54) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో గల హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో ప్రభుత్వ స్కూళ్ల నాయకత్వ శిక్షణ కార్యక్రమం మూడు రోజుల నుంచి జరుగుతున్న సంగతి తెలిసిందే. ఉణుదుర్రులో మూడేళ్ల నుంచి రత్నకుమార్ లెక్కల ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా కొనసాగుతున్నారు. ఆయన భార్య చంద్రకళ కూడా ఇదే పాఠశాలలో ఇంగ్లీషు టీచరుగా పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం కేశవరం, ఇద్దరు పిల్లల చదువు నిమిత్తం భీమవరంలో నివాసం వుంటున్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపీటీసీ అల్లూరి మాధవి తదితరులు స్వగ్రామానికి విచ్చేసి నివాళులర్పించి, సంతాపం తెలిపారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.



రత్నకుమార్ (ఫైల్)

**ఉపాధ్యాయ సంఘాల ఆందోళన**

హెచ్‌ఎం ఆకస్మిక మృతి ఘటనపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా స్పందించాయి. శిక్షణ తరగతులు జిల్లాకు మారుమూల ప్రాంతమైన అగిరిపల్లిలో పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశా యి. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్‌కు బుధవారం పంపిన లేఖ నకళ్లను విలేకరులకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు విడుదల చేశారు. శిక్షణ కేంద్రంలో సరైన వైద్యస దుపాయం అందకపోవడం వల్లే హెచ్‌ఎం మరణించారని తెలిపారు. శిక్షణను మూడు రోజులకు కుదించాలని, అనారోగ్య సమస్యలున్న వారికి మినహాయింపు నివ్వాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ కోరారు. హెఎం మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏపీటీ ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు.

# ఏడుకు చేరిన బాణసంచా మృతుల సంఖ్య

● చికిత్స పొందుతూ మరొకరి మృతి

పెంటపాడు/ఉంగ్రాజవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఉంగ్రాజవరం మండలం సూర్యారావుపా లెంలో గత నెల 30వ తేదీన బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన దుర్ఘటనలో మృతు ల సంఖ్య ఏడుకు చేరింది. బుధవారం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింటు(43) ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతితో ఈ ప్రమాదంలో గాయపడిన వారంతా మృతి చెందినట్టు అయింది. పెద్దింట్లుకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోజు కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. గ్రామంలో విషాదం అలుముకున్నది.

# మహిళల రక్షణకు అభయ : ఐజీ

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో మహిళలకు అండగా పోలీస్ శాఖ మరో ముందుగు వేసింది. ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అభయ మహిళా సేఫ్టీ లోగోను ఆవిష్కరించి బృందాలను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాపశివకిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి బుధవారం ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. డీఐజీ మాట్లాడుతూ జిల్లాలో అభయ మహిళా సేఫ్టీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు ఎస్పీని అభినందించారు. పోలీసు వ్యవస్థలో 30 శాతం మహిళా పోలీస్ సిబ్బంది పని చేస్తున్నారని, భవిష్యత్తులో జరిగే రిక్రూట్‌మెంట్ లోను 30 శాతం మహిళలను నియమించనున్నట్టు ప్రకటించారు. మహిళా సేఫ్టీలో మహిళా పోలీసులు, గ్రామ మహిళల సంరక్షణ కార్యదర్శులు కాలేజీలు, హాస్టల్స్ బస్టాండ్‌ల వద్ద ఆకతాయిలు వేధింపులకు గురి చేసే ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు పాటుపడాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా మహిళలు, యువతులు, బాలికలను వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రత, సేఫ్టీ ఈ అభయ యాప్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన 95503 51100 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని లేదా టోల్‌ఫ్రీ నంబరు 112కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. జేసీ మాట్లాడుతూ అభయ యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

# షష్ఠి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

**ఎమ్మెల్యే కామినేని**



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంవద్ద రాట పూజ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో షష్ఠి కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు, గ్రామస్థులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. దేవస్థానంలో డిసెంబరు 7 నుంచి 13 రోజులపాటు జరగనున్న షష్ఠి కల్యాణోత్సవాల ఏర్పాట్లను బుధవారం ఉదయం ఆయన రాట (స్తంభ) పూజ చేసి ప్రారంభించారు. ఉత్సవ ఏర్పాట్లలో ఎటువంటి లోటు లేకుండా చూసి భక్తులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాదేవి తెలిపారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, టీడీపీ నాయకులు చలసాని జగన్మోహనరావు, కొత్తూరు విఠల్, బొంగు రవికుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, నాయకులు పసుపులేటి నరసింహారావు, మేలిమి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

### దళిత శ్మశానవాటిక అభివృద్ధి..

కైకలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దళిత శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులోని వైఎస్సార్‌కాలనీలోని చివర దళిత శ్మశానవాటికను, డంపింగ్ యార్డ్‌ను బుధవారం పరిశీలించారు. శ్మశానవాటికను నాలుగు అడు గుల మేర మట్టి తోలి మెరక చేసి ముంపు సమ స్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రహరీ నిర్మాణం చేపడతామన్నారు. కైకలూరు- ఏలూరు ఆర్‌అండ్‌బీ రహదారిలోని డంపింగ్ యార్డ్‌లోని చెత్తను మరొక చోటుకు తరలించేలా ఎమ్మెల్యే కామినేని చర్యలు తీసుకోవడంతో ఆ ప్రాంత ప్రజలంతా కృతజ్ఞతలు తెలిపారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడమే ఎన్‌డీఏ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బొమ్మినంపాడులో సివిల్ సప్లయిస్ శాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ధాన్యం కొను గోలులో రైతులు ఇబ్బందులు పడకుండా వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని కామినేని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, టీడీపీ నాయకులు వీరమల్లు నరసింహారావు, చలసాని జగన్మోహనరావు, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, సర్పంచ్ దారం సుధ, జనసేన, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారం భించిన అనంతరం కేంద్రం ఏర్పాటు విషయాన్ని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి రైతులకు ఫోన్‌లోనే శుభాకాంక్షలు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

### చాట్రాయి హైస్కూల్‌కు ల్యాప్‌టాప్ వితరణ

చాట్రాయి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ కొండపల్లి రఘునాథరెడ్డి బుధవారం హెచ్‌ఎం కృష్ణయ్యకి లాప్‌టాప్ అందజేశారు. ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణకు లాప్‌టాప్ వినియోగించాలని కోరారు. గతంలో రఘునాథరెడ్డి హైస్కూల్‌కు ప్రింటర్ అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న పూర్వ విద్యార్థి రఘునాథరెడ్డిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

### రేపు రహదారులపై సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన

ముసునూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు వెళ్ళే ప్రధాన రహదారి మరమతు చేయాలని కోరుతూ శుక్రవారం సింహాద్రిపురం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నాయకులు చలసాని వెంకట రామారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతత ప్రభుత్వ పాలనలో ఈ రహదారి మరమత్తులకు నోచుకోక మరింత అధ్వానంగా మారిందని, వాహనదారులు, ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చలసాని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని చలసాని పిలుపునిచ్చారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముసునూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో జేఈ సుబ్బారావు తెలిపారు. విద్యుత్ లైన్‌లు మరమత్తుల నిమిత్తం అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, సూరేపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 1గంట నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని సుబ్బారావు కోరారు.

### విద్యార్థుల మధ్య ఘర్షణ

ఏలూరు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఆర్ పేటలో రెండు కార్పొరేట్ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు ఘర్షణ పడ్డారు. కళాశాల బస్సు బుధవారం సాయంత్రం చింతలపూడి రోడ్డులో వెళుతుండగా మరో కళాశాలకు చెందిన విద్యార్థులు అడ్డగించి ఇద్దరు విద్యార్థులపై దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు కొంత మంది విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### రైల్వే సమస్యలపై ఎంపీ వినతి

భీమడోలు, నవంబరు 06 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైల్వే శాఖ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ చైర్మన్ సతీష్‌కుమార్‌కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వినతిపత్రాన్ని అందజేశారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఆయనను కలిసి జిల్లాలో సమస్యలను వివరించారు.



మోకసాకలవపూడి పీఏసీఎస్‌ను కంప్యూటరీకరణ చేస్తున్న అధికారులు

### మోకసాకలవపూడి పీఏసీఎస్ కంప్యూటరీకరణ

మండవల్లి నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండవల్లిలోని కృష్ణాజిల్లా కోఆపరేటివ్ కేంద్ర బ్యాంక్ పరిధిలోని మోకసాకలవపూడి పీఏసీఎస్‌ను బుధవారం కంప్యూటరీకరణ చేశారు. ఏలూరు జిల్లా కోఆపరేటివ్ అధికారి ఆరుమిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేడీసీసీ బ్యాంకు మండవల్లి బ్రాంచ్ సూపర్‌వైజర్, ఏలూరు జిల్లా డీపీఎంయూ ఉండవల్లి సాయికృష్ణ పర్యవేక్షణలో మోకాసకలవపూడి పీఏసీఎస్ కంప్యూటీకరణ పూర్తిచేశారు. కేడీసీసీ బ్యాంకు మరియు ఉమ్మడి కృష్ణా జిల్లాలో రెండవ పీఏసీఎస్‌గా, ఏలూరు జిల్లాలో రెండవ పీఏసీఎస్‌గా మోకసాకలవపూడి పీఏసీఎస్ కంప్యూటరీకరణ పూర్తి చేశారు. సబ్‌డిఎల్‌సీవో అబ్దుల్ హదీ, మండవల్లి బ్రాంచ్ మేనేజర్ రాజులపాటి సత్యనారాయణ, సీనియర్ ఇనెస్పెక్టర్లు ఆనంద్ నెహ్రూ, వెంకటేశ్వరరావు, మండవల్లి బ్రాంచ్ పరిధిలోని ఏడు సంఘాల కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన గ్రూపులకు బ్యాంక్ రుణాలు





సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ అధికారులు

ఆగిరిపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజి రుణాలు మంజూరు చేస్తామని బ్యాంక్ అధికారి తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆగిరిపల్లి, అడవినెక్కలం బ్రాంచ్ సీబీ ఆర్ఎం కమిటీ (కమ్యూనిటీ బేస్డ్ రికవరీ మెకానిజం) సమావేశం వెలుగు కార్యాలయంలో ఏపీఎం దయాల రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా యుబీఐ రీజనల్ ఆఫీస్ ఆర్ఏబిడి హెడ్ కె.నరేంద్ర వర్మ పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాలకు యూబీఐ ద్వారా బ్యాంకు లింకేజి రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అర్హత కలిగిన ప్రతి సంఘం వారు సీసీఎల్ లోన్స్ తీసుకుని తిరిగి సక్రమంగా చెల్లించాలన్నారు. బ్యాంకు లింకేజి రికవరీ మొత్తాన్ని సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌లోనే జమ చేయాలని, బీసీ పాయింట్లలో ఎవరూ కట్టవద్దని సూచించారు. దయాల రాజశేఖర్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజి రుణాల రికవరీలో ఆగిరిపల్లి మండలం జిల్లాలోనే ప్రథమస్థానంలో ఉందని, అర్హత కలిగిన సంఘాలన్ని కూడా రుణాలు తీసుకోవాలని, మహిళలందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. యూబీఐలో ఉన్నటువంటి సమస్యలను బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ కార్యక్రమంలో యూబీఐ ఆగిరిపల్లి బ్రాంచ్ మేనేజరు ఎం.జగన్ మోహన్‌రావు, యూబీఐ అడవినెక్కలం బ్రాంచ్ మేనేజరు అనిల్‌కుమార్, యూబీఐ ఫీల్డ్ ఆఫీసర్ కె.అరవింద్, సీసీలు దివ్య, లక్ష్మి, హుస్సేన్, వీవోఏఎస్ బుక్ కీపర్ పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం



సీసీరోడ్ల పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వమని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు అన్నారు. లోపూడిలో నూతనంగా సీసీరోడ్డు నిర్మించే అంతర్గత రహదారిపై సిమెంట్ తూరల ఏర్పాటు పనులు బుధవారం ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.21 లక్షలతో 550 మీటర్ల సీసీరోడ్లు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, భవిష్యత్‌లో గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందనున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలమాల వెంకటేశ్వరరావు, లక్కపాము కాంతారావు, నక్కా చెన్నారావు, వెంకటరత్నం పాల్గొన్నారు.

# టెన్నీకాయిట్ పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కానుకొల్లు అధ్యాపక బృందం

మండవల్లి నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన కృష్ణా జిల్లా గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలలో కానుకొల్లు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపి సీనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీ లకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం స్థానిక హైస్కూల్లో ఉపాధ్యాయులు అభినందించారు. సీనియర్ బాలుర విభాగంలో నాగసాయి, మోహన్‌శశి, సీనియర్ బాలికల విభాగంలో రుక్మిణిదేవి, సౌమ్యశ్రీ, జూనియర్ బాలుర విభాగంలో వంశీకృష్ణ, నవదీప్, జూని యర్స్ బాలికల విభాగంలో కావ్యలను రాష్ట్రస్థా యి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 9, 10 తేదీల్లో చింతలపూడి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన పీడీ సత్యనారాయణను పాఠశాల హెచ్‌ఎం మాధవరావు అభినందించారు.

### పెదపాలపర్రు విద్యార్థిని..



శ్రీ వర్షిణి

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థినికి సిహెచ్.శ్రీ వర్షిణి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైంది. గూడూరులో జరిగిన అండర్- 17 బాలికల జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభను కనబర్చి శ్రీ వర్షిణి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం పాండురంగారావు, పీఈటీ పద్మ తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు యనమదల విద్యార్థులు



రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులు

నూజివీడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడల్లో యనమదల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్ నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణాజిల్లా గన్నవరంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో తమ పాఠశాలకు చెందిన సిహెచ్ ప్రశాంత్, జి.సుబ్బరాజు, డి.హేమశ్రీ సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. మున్నా, ప్రేమ్‌కుమార్, రిషిత బేస్‌బాల్ జట్టుకు ఎంపిక అయ్యారన్నారు. వారు గుంటూరు, చిత్తూరు, అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడాపోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యాకమిటీ చైర్మన్ పలగాని శ్రీనివాసరావు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



పాడి రైతులతో మాట్లాడుతున్న చైర్మన్

చాట్రాయి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):పాడి రైతుల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా విజయ డెయిరీ పని చేస్తున్నదని సంస్థ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. యర్రవారిగూడెం, కొత్తగూడెం గ్రామాలలో బుధవారం ఆయన పాడి రైతులతో మాట్లాడారు. పాల అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, సబ్సిడీపై అందిస్తున్న కాల్షియం, సెమన్, పశువుల దాణా, నట్టల నివారణ మందు, మొదలైన వాటి గురించి వివరించారు. పాడి రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, పలనాటి సత్యనారాయణ, క్లస్టర్ మేనేజరు సాంబశివ మూర్తి, సంఘాల అధ్యక్షులు గంగారత్నం, శేషకుమారి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటు నమోదుకు 1300 దరఖాస్తులు

కలిదిండి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పట్టభద్రుల ఓటు నమోదుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 1300 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. బుధవారంతో పట్టభద్రుల ఓటు నమోదు దరఖాస్తుల స్వీకరణ ముగిసిందన్నారు.

# మినప సాగును బీమా చేయించండి

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే మినుము పైరుకు పంటల బీమా చేయించుకోవాలని మండల ఏవో బి.వేణుమాధవ్ తెలిపారు. అల్లూరు, బొమ్మినంపాడుల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎకరానికి మినుము పైరుకు రైతులు రూ.60 ప్రీమియం చెల్లించాలని, గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి సర్టిఫికెట్ తీసుకుని రైతులు మీ సేవా కేంద్రంలో ప్రీమియం కట్టాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఆ విభాగం మండల ఇంచార్జ్ గీతం కుమార్ వివరించారు. సర్పం చ్‌లు సుధ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# హుండీల ఆదాయం రూ.2,05,437

కైకలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీల మొక్కుబడుల ఆదాయం రూ.2,05,437 వచ్చినట్లు ఈవో వీఎన్‌కె శేఖర్ తెలిపారు. బుధవారం గుడివాడ ఎండోమెంట్ తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపును నిర్వహించారు. 46 రోజుల కాలవ్యవధిలో ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, శ్రీమన్నారాయణగోష్ఠి మహిళలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు

# వైభవంగా పార్వతీ పరమేశ్వరుల నిమజ్జనం

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పెదగొన్నూరు శివారు ఉప్పరగూడెంలో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాల నిమజ్జనో త్సవం వైభవంగా జరిగింది. గ్రామంలో పార్వతీ, పరమేశ్వరులను ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు రెడ్డి సన్యాసిరావు, సభ్యులు పాల్గొన్నారు.



ఉత్తర ద్వారం నిర్మాణానికి శంకుస్థాపన

# అపర భద్రాద్రిలో ఉత్తర ద్వారం నిర్మాణం

చాట్రాయి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అపర భద్రాద్రిగా పేరుగాంచిన చనుబండ కోదండరామస్వామి ఆలయంలో బుధవారం ఉత్తర ద్వారం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తగుండ్ల రాంబాబు జ్ఞాపకార్థం ఆయన కుమారులు సుధీర్, వంశీ, రాజగోపాల్ విరాళంతో ఉత్తర ద్వారం నిర్మాణం చేపట్టారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు, బీజేపీ నాయకుడు నెక్కళపు వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు , భక్తులు పాల్గొన్నారు.

### వాసవీ పాటల సీడీ ఆవిష్కరణ

కైకలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిపై రచించిన రెండు పాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్‌తాతయ్య అన్నారు. కైకలూరుకు చెందిన విద్యా సంస్థల అధినేత సయ్యద్ జమీల్ అహ్మద్ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిపై రచించిన రెండు పాటలను బుధవారం జగ్గయ్యపేటలో శ్రీరామ్‌తాతయ్య ఆవిష్కరించారు. జమీల్ అహ్మద్‌ను సన్మానించారు. రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజెఎఎస్ మాల్యాద్రి, టీడీపీ నాయకులు ఈదా వెంకటస్వామి, కనిశెట్టి శ్యామ్, గడిదేశి విజయ్, జగ్గయ్యపేట ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.